TGTEL/26A6221

# తొలివెలుగు

TOLE VELUGGU JATIYAPATRIKA

ప్రతి అక్షరం.. ప్రజల పక్షం    జాతీయ పత్రిక

| యాదాద్రి భువనగిరి | సంపుటి: 01 | సంచిక : 04 | శనివారం | 1-8-2026 | పేజీలు: 08 | వెల: రూ.2/- |
|---|---|---|---|---|---|---|
| Yadadri Bhuvanagiri | Volume:01 | Issue:04 | Saturday | 1-8-2026 | Pages:08 | Cost:2/- |


విలేకరులు కావలెను
తొలివెలుగు జాతీయ దిన పత్రిక
మన భాష.. మన పత్రిక..
www.epaper.tholivelugu.com
Contacts
తెలంగాణ
94911 34365
ఆంధ్రప్రదేశ్,
తెలంగాణ రాష్ట్రాల్లో
తొలివెలుగు జాతీయ తెలుగు దినపత్రికలో పలు విభాగాల్లో పనిచేయుటకు ఉత్సాహవంతులైన స్టేట్ బ్యూరో, జిల్లా స్టాపర్లు, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు, మండల రిపోర్టర్లు కావలెను. ఆసక్తి.. అనుభవం గల వారు సంప్రదించగలరు.

## పార్లమెంట్ పవిత్రతను కాపాడండి

**లేదంటే కఠిన చర్యలు తీసుకుంటాం**

**లోక్‌సభలో విపక్ష ఎంపీలపై స్పీకర్ ఓం బిర్లా ఆగ్రహం**

**రాజ్యసభలోనూ విపక్షాలను తప్పుపట్టిన చైర్మన్ రాధాకృష్ణన్**

**ఉభయ సభలు సోమవారానికి వాయిదా**



న్యూఢిల్లీ: పార్లమెంట్ ఉభయ సభల్లో విపక్ష సభ్యులు వ్యవహరిస్తున్న తీరుపై సభాధ్యక్షులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సభా కార్యక్రమాలను పదేపదే అడ్డుకోవడం, విభిన్న వేషధారణల్లో సభకు హాజరు కావడంపై సభ్యులకు హెచ్చరికలు జారీ చేశారు. శుక్రవారం లోక్‌సభలో ప్రశ్నోత్తరాలు మొదలైన వెంటనే ప్రతిపక్ష ఎంపీలు ఆందోళనకు దిగారు. ఢిల్లీలో విద్యార్థులపై జరిగిన దాడిపై కేంద్ర హోంమంత్రి అమిత్‌షా సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. "సభలో అర్థవంతమైన చర్చలు, సంభాషణల కోసం ప్రజలు మిమ్మల్ని ఎన్నుకున్నారు. సభ గౌరవం, పవిత్రతను కాపాడటం ప్రతి సభ్యుడి బాధ్యత"అని తేల్చిచెప్పారు.



## అనిశ్చితి వేళ అత్యయిక భేటీ

**భారత్‌పై పశ్చిమాసియా పరిణామాలను విశ్లేషించిన ప్రధాని మోదీ  భద్రతపై కేబినెట్ కమిటీ సమావేశంలో మోదీ సమీక్ష**

న్యూఢిల్లీ: పశ్చిమాసియాలో మళ్లీ రోజురోజుకూ ప్రతికూల పరిస్థితులు ఎదురవుతుండటంతో అక్కడి విపరిణామాలు భారత్‌పై ఏమేరకు ప్రభావం చూపుతున్నాయనే విషయమై ప్రధాని మోదీ కీలక సమీక్ష జరిపారు. కీలక శాఖల మంత్రులు, ఉన్నతాధికారులను పలు అంశాలపై ప్రధాని ఆరా తీశారు. తన అధ్యక్షతన గురువారం ఢిల్లీలో జరిగిన భద్రతపై కేబినెట్ కమిటీ(సీసీఎస్) అత్యవసర సమావేశంలో ప్రధాని మోదీ ఇంధన అవసరాల కోసం కొనసాగుతున్న దిగుమతుల తీరుతెన్నులు, అవలంభిస్తున్న అంతర్జాతీయ విధానాలను సమీక్షించారు.

- మిగతా 2వ పేజీలో

భోగాపురంలో రేపు ఎయిర్ పోర్ట్ ప్రారంభించనున్న మోదీ...

## ఏర్పాట్లపై సీఎం చంద్రబాబు టెలీకాన్ఫరెన్స్

**భోగాపురం ఎయిర్‌పోర్ట్ ఏర్పాట్లపై సీఎం చంద్రబాబు సమీక్ష**

**తెలుగు సంస్కృతి ఉట్టిపడేలా ఏర్పాట్లు చేయాలని ఆదేశం**

**థింసా నృత్యంతో ప్రపంచ రికార్డు సృష్టించాలని సూచన**

**ప్రధాని మోడీకి ఘన స్వాగతం పలకాలని దిశానిర్దేశం**

విజయనగరం జిల్లా భోగాపురంలో అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయ ప్రారంభోత్సవ ఏర్పాట్లపై ముఖ్యమంత్రి చంద్రబాబు శుక్రవారం ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. రేపు (ఆగస్టు 1) ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా ప్రారంభం కానున్న ఈ విమానాశ్రయ పనుల పురోగతిపై ఆయన అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు.



## మీ పెట్టుబడులకు రక్షణ

**పెట్టుబడులకు తెలంగాణ రాష్ట్రం సురక్షితమన్న రేవంత్ రెడ్డి**

**గత ప్రభుత్వాల మంచి విధానాలను కొనసాగిస్తామన్న ముఖ్యమంత్రి**

**చంద్రబాబు, కాంగ్రెస్ హయాంలో జరిగిన అభివృద్ధి ప్రస్తావన**

**రాష్ట్రానికి 3 బుల్లెట్ రైలు ప్రాజెక్టులు, 2 కొత్త ఎయిర్‌పోర్టులు**

**అమెజాన్, అదానీ గ్రూపుల భారీ పెట్టుబడుల వెల్లడి**

పెట్టుబడులకు తెలంగాణ అత్యంత సురక్షితమైన, అనుకూలమైన రాష్ట్రమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భరోసా ఇచ్చారు. హైదరాబాద్‌లో కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ (సీఐఐ) నార్తర్న్ రీజనల్ కౌన్సిల్ ప్రతినిధులతో జరిగిన సమావేశంలో ఆయన ప్రసంగించారు. రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అపార అవకాశాలను వివరిస్తూ, పారిశ్రామికవేత్తలకు ప్రభుత్వం నుంచి పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, "నాయకులు, పార్టీలు మారవచ్చు కానీ, గత ప్రభుత్వాలు చేపట్టిన మంచి పనులను మేం కొనసాగిస్తాం" అని స్పష్టం చేశారు. మాజీ ప్రధాని పీవీ నరసింహారావు ప్రవేశపెట్టిన ఆర్థిక సంస్కరణలను, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా చంద్రబాబు హయాంలో బిల్ గేట్స్, బిల్ క్లింటన్ వంటి అంతర్జాతీయ ప్రముఖులను హైదరాబాద్‌కు రప్పించి పెట్టుబడులను ఆకర్షించిన తీరును

- మిగతా 2వ పేజీలో



2లో



## పెద్ది సుదర్శన్ రెడ్డి అంత్యక్రియల్లో హరీశ్ రావు

**నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి గుండెపోటుతో కన్నుమూత**

**ఉద్యమ సహచరుడి మరణం తీరని లోటన్న బీఆర్ఎస్ అధినేత కేసీఆర్**

**అంతిమయాత్రకు భారీగా తరలివచ్చిన బీఆర్ఎస్ శ్రేణులు, అభిమానులు**

2లో



## పరుగులు తీస్తున్న కృష్ణమ్మ

**జూరాల నుంచి 24 క్రస్టు గేట్ల ద్వారా దిగువన ఉన్న శ్రీశైలం వైపు పరుగులు పెడుతున్న కృష్ణమ్మ**

**జూరాల 24 క్రస్టు గేట్ల ఎత్తివేత  శ్రీశైలం ప్రాజెక్టులోకి 1.31 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో**



## పెమ్మసానిపై ఏఐ వీడియో.. అంబటి రాంబాబుపై సీఐడీ కేసు నమోదు

**మరోసారి చిక్కుల్లో పడిన మాజీ మంత్రి అంబటి రాంబాబు**

**కేంద్ర సహాయ మంత్రి పెమ్మసానిపై ఏఐ వీడియో పోస్ట్ చేశారన్న ఆరోపణ**

**పెమ్మసాని ప్రతిష్టకు భంగం కలిగించేలా వీడియో ఉందని ఫిర్యాదు**

**పిల్లి మాణిక్యాలరావు ఫిర్యాదుతో చర్యలు చేపట్టిన పోలీసులు**

## భువనేశ్వరి వ్యాఖ్యల్లో నిజం లేదు



- అసెంబ్లీలో తనను అవమానించారన్న భువనేశ్వరి వ్యాఖ్యలను నిరూపించాలని లక్ష్మీపార్వతి సవాల్
- టీడీపీ ప్రభుత్వం అసెంబ్లీ రికార్డులను బహిర్గతం చేయాలని డిమాండ్
- చంద్రబాబు, లోకేశ్ రాజకీయ లబ్ధి కోసమే భువనేశ్వరిని తెరపైకి తెచ్చారని ఆరోపణ
- ఎన్నికల హామీలను విస్మరించిన కూటమి ప్రభుత్వంపై లక్ష్మీపార్వతి విమర్శలు
- రెడ్ బుక్ పాలనపై క్షమాపణ చెప్పాకే భువనేశ్వరి రాజకీయాల్లోకి రావాలని హితవు

## పోరాటాలను అక్రమ కేసులు ఆపలేవు

- ఫార్ములా-ఈ రేసు కేసుకు సంబంధించి కోర్టు విచారణకు హాజరైన కేటీఆర్
- తదుపరి విచారణకు ఆగస్టు 25కి వాయిదా వేసిన కోర్టు
- పెద్ది సుదర్శన్ రెడ్డి అంత్యక్రియల్లో పాల్గొనేందుకు బయల్దేరిన కేటీఆర్



2లో

## సూపర్ ఎల్ నినో సమయంలో ప్రతి నీటి బొట్టు విలువైనదే: పవన్ కల్యాణ్

**పవన్ తో సమావేశమైన నిమ్మల రామానాయుడు**

**రాష్ట్రంలోని సాగునీటి పరిస్థితులపై చర్చించిన నేతలు**

**నీటి ఎద్దడిపై రైతుల్లో అవగాహన కల్పించాలన్న పవన్**

2లో



## భోగాపురంలో రేపు ఎయిర్ పోర్ట్ ప్రారంభించనున్న మోదీ...

### ఏర్పాట్లపై సీఎం చంద్రబాబు టెలీకాన్ఫరెన్స్

విమానాశ్రయ ప్రాంగణాన్ని తెలుగు సంస్కృతి, వారసత్వ వైభవాన్ని ప్రతిబింబించేలా తీర్చిదిద్దాలని ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ముఖ్యంగా, గిరిజన సంప్రదాయ నృత్యమైన 'థింసా'ను కళ్లుచెదిరే స్థాయిలో నిర్వహించాలని సూచించారు. ప్రారంభోత్సవానికి విచ్చేస్తున్న ప్రధానికి అత్యంత ఘనంగా స్వాగతం పలకాలని కూడా ఆయన స్పష్టం చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర మంత్రులు అచ్చెన్నాయుడు, సత్యకుమార్ యాదవ్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్, పరిశ్రమల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి. కృష్ణబాబు, ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, సంబంధిత జిల్లాల కలెక్టర్లు పాల్గొన్నారు.

## పెమ్మసానిపై ఏఐ వీడియో.. అంబటి రాంబాబుపై సీఐడీ కేసు నమోదు

వైసీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబుపై సీఐడీ కేసు నమోదైంది. కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌ను లక్ష్యంగా చేసుకుని సోషల్ మీడియాలో ఒక ఏఐ-జనరేటెడ్ వీడియోను పోస్ట్ చేశారన్న ఆరోపణలపై గుంటూరులోని మంగళగిరి సీఐడీ కార్యాలయంలో ఈ కేసు రిజిస్టర్ చేశారు. కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చేతులకు సంకెళ్లు వేసినట్టుగా ఉన్న ఒక ఏఐ వీడియోను అంబటి రాంబాబు సోషల్ మీడియాలో పంచుకున్నారని ఆరోపణలు వచ్చాయి. ఈ వీడియో ద్వారా పెమ్మసాని ప్రతిష్టకు భంగం కలిగించేలా తప్పుడు ప్రచారం చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై టీడీపీ నేత పిల్లి మాణిక్యాలరావు గుంటూరు జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేశారు. పెమ్మసాని పరువు ప్రతిష్ఠలను దెబ్బతీసే ఉద్దేశంతోనే ఈ వీడియోను సర్క్యులేట్ చేశారని, దీనిపై సమగ్ర విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన తన ఫిర్యాదులో కోరారు. ఈ ఫిర్యాదు ఆధారంగా పోలీసులు అంబటి రాంబాబుపై కేసు నమోదు చేసి, దర్యాప్తు ప్రారంభించారు.

## భువనేశ్వరి వ్యాఖ్యల్లో నిజం లేదు: లక్ష్మీపార్వతి

ముఖ్యమంత్రి చంద్రబాబు అర్ధాంగి నారా భువనేశ్వరికి వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లక్ష్మీపార్వతి సవాల్ విసిరారు. ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీలో తనను అవమానించారంటూ భువనేశ్వరి చేసిన వ్యాఖ్యలు నిజమైతే, అందుకు సంబంధించిన ఆధారాలను బయటపెట్టాలని ఆమె డిమాండ్ చేశారు. ఇటీవల కుప్పం పర్యటనలో భువనేశ్వరి చేసిన వ్యాఖ్యలు పూర్తిగా అవాస్తవమని, కేవలం రాజకీయ సానుభూతి పొందేందుకే అలా మాట్లాడుతున్నారని లక్ష్మీపార్వతి కొట్టిపారేశారు. తాడేపల్లిలోని వైసీపీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం ఆమె మీడియాతో మాట్లాడారు. ప్రస్తుతం తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉందని, అసెంబ్లీ రికార్డులు మొత్తం వారి చేతిలోనే ఉన్నాయని గుర్తుచేశారు. భువనేశ్వరి ఆరోపణలు నిజమే అయితే, ప్రభుత్వం వెంటనే ఆ రికార్డులను బహిర్గతం చేయాలే తప్ప, ఇలా సానుభూతి రాజకీయాలు చేయడం సరికాదని హితవు పలికారు. టీడీపీ వ్యవస్థాపకుడు, దివంగత మాజీ ముఖ్యమంత్రి ఎన్.టి. రామారావు చట్టబద్ధమైన రెండవ భార్యగా ఉన్న తనను ఐటీడీపీ సోషల్ మీడియాలో అసభ్యకరమైన ట్రోలింగ్, మార్ఫింగ్ చిత్రాలతో వేధించినప్పుడు భువనేశ్వరి ఎందుకు మౌనంగా ఉన్నారని లక్ష్మీపార్వతి ప్రశ్నించారు. రాజకీయ లబ్ధి కోసమే చంద్రబాబు, ఆయన కుమారుడు లోకేశ్ కలిసి భువనేశ్వరిని రాజకీయాల్లోకి లాగారని ఆరోపించారు. వైసీపీ ఎప్పుడూ ఆమెపై వ్యక్తిగత వ్యాఖ్యలు చేయలేదని స్పష్టం చేశారు. వైఎస్ కుటుంబంలోని మహిళలపై ఆన్‌లైన్‌లో దాడులు జరిగినప్పుడు గానీ, రాష్ట్రంలో మహిళలు, చిన్నారులపై అఘాయిత్యాలు పెరిగిపోతున్నప్పుడు గానీ భువనేశ్వరి ఎందుకు స్పందించలేదని నిలదీశారు.ఇచ్చిన ప్రతీ హామీని నిలబెట్టుకుంటానని చంద్రబాబు చెప్పడం "ఈ సంవత్సరంలోనే అతిపెద్ద జోక్" అని లక్ష్మీపార్వతి ఎద్దేవా చేశారు. ఆడబిడ్డ నిధి, ఉచిత గ్యాస్ సిలిండర్లు వంటి కీలక హామీలను కూటమి ప్రభుత్వం అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు. దివంగత రాజశేఖర రెడ్డి, జగన్ ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నారని, చంద్రబాబు, లోకేశ్ అలా కాదని అన్నారు. 2024 ఎన్నికల ప్రచారంలో లోకేశ్ ప్రదర్శించిన 'రెడ్ బుక్' పాలన గురించి కూడా ఆమె ప్రస్తావించారు. వైసీపీ హయాంలో టీడీపీ నేతలను లక్ష్యంగా చేసుకున్న అధికారుల పేర్లు అందులో ఉన్నాయని చెప్పి, ఇప్పుడు కక్ష సాధింపు రాజకీయాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. భువనేశ్వరి క్రియాశీల రాజకీయాల్లోకి వస్తే స్వాగతిస్తానని, అయితే రాజకీయాల్లోకి ప్రవేశించే ముందు చంద్రబాబు, లోకేశ్‌ల 'రెడ్ బుక్' పాలన, దుష్పరిపాలనలకు గాను రాష్ట్ర ప్రజలకు ఆమె క్షమాపణ చెప్పాలని లక్ష్మీపార్వతి డిమాండ్ చేశారు.

## పోరాటాలను అక్రమ కేసులు ఆపలేవు

"ప్రజల తరఫున మేం చేసే పోరాటాలను ఇటువంటి తప్పుడు కేసులు ఎంతమాత్రం ఆపలేవు.. అంతిమంగా సత్యమే గెలుస్తుంది" అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ ఘాటుగా వ్యాఖ్యానించారు. ఫార్ములా-ఈ రేసు వ్యవహారానికి సంబంధించిన కేసు విచారణలో భాగంగా నాంపల్లి కోర్టుకు హాజరైన సందర్భంగా ఆయన కాంగ్రెస్ ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. ఉదయం కోకాపేటలోని తన నివాసం నుంచి నేరుగా నాంపల్లి కోర్టుకు కేటీఆర్ చేరుకున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తనపై కుట్రపూరితంగా అక్రమ కేసు బనాయించిందని ఆయన మండిపడ్డారు. మరోవైపు, తదుపరి విచారణకు కోర్టు ఆగస్టు 25కి వాయిదా వేసింది. కోర్టు ప్రక్రియ ముగిసిన అనంతరం, అకాల మరణం చెందిన పార్టీ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి అంత్యక్రియల్లో పాల్గొనేందుకు ఆయన నర్సంపేటకు బయలుదేరారు. యూకేకు చెందిన 'ఫార్ములా-ఈ ఆర్గనైజేషన్'కు నిబంధనలకు విరుద్ధంగా రూ. 55 కోట్లు మళ్లించారనే అభియోగంపై ఏసీబీ ఈ కేసు నమోదు చేసింది. సుదీర్ఘ దర్యాప్తు అనంతరం ఏసీబీ దాఖలు చేసిన ఛార్జ్‌షీట్‌ను కోర్టు పరిగణనలోకి తీసుకోవడంతో, నిందితులుగా ఉన్న కేటీఆర్‌తో పాటు మాజీ ఐఏఎస్ అధికారి అరవింద్ కుమార్, హెచ్ఎండీఏ మాజీ అధికారి బీఎల్ఎన్ రెడ్డి తదితరులు న్యాయస్థానానికి హాజరయ్యారు.

# పార్లమెంట్ పవిత్రతను కాపాడండి

సభలో ప్లకార్డులు, బ్యానర్లు తీసుకురావడం పార్లమెంట్ సంప్రదాయాలు, మర్యాదలకు విరుద్ధమని పేర్కొన్నారు. వారి వ్యవహార శైలిని స్పీకర్ ఓం బిర్లా తప్పుపట్టారు. ప్రశ్నోత్తరాల సమయం సభ్యులకు అత్యంత ముఖ్యమైనదని, ఉద్దేశపూర్వకంగా సభా కార్యక్రమాలను అడ్డుకోవడం సరికాదని స్పష్టం చేశారు. దఅలాంటి చర్యలను దూరంగా ఉండాలని సూచించారు. ఇదే సమయంలో కొందరు సభ్యులు వేషధారణ మార్చుకుని సభకు రావడంపైనా స్పీకర్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. "పార్లమెంట్ గౌరవానికి భంగం కలిగించేలా వేషాలు వేసుకుని రావడం తగదు. సభ పవిత్రత, గౌరవాన్ని కాపాడడం అందరి బాధ్యత. ఇటువంటి చర్యలు పునరావృతమైతే కఠిన చర్యలు తీసుకుంటాం"అని హెచ్చరించారు.

**సభ్యుల హక్కులను హరించొద్దు**

కాంగ్రెస్ ఎంపీ ప్రియాంకగాంధీ వాద్రా తన ప్రశ్న అడగడానికి నిలుచున్నప్పటికీ, ప్రతిపక్షాల ఆందోళన కొనసాగడంతో ప్రశ్నోత్తరాలు జరగలేదు. స్పీకర్ స్పందిస్తూ.. "ప్రియాంక గాంధీ ప్రశ్న అడగడానికి సిద్ధంగా ఉన్నారు. అయినా సభను అడ్డుకోవడం సభ్యుల హక్కులను హరించడమే అవుతుంది"అని స్పష్టంచేశారు. అయినప్పటికీ విపక్షాల ఆందోళన ఆగకపోవడంతో స్పీకర్ సభను మధ్యాహ్నం 12 గంటల వరకు వాయిదా వేశారు. సభ పునఃప్రారంభమైన తర్వాత విపక్షాల ఆందోళన మధ్యే ప్రభుత్వం రిజిస్ట్రేషన్ ఆఫ్ బర్త్స్ అండ్ డెత్స్(సవరణ) బిల్లు--2026ను ప్రవేశపెట్టింది. విపక్ష ఎంపీలు నినాదాలు చేస్తుండడంతో పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు అభ్యంతరం తెలిపారు. ప్రతిపక్ష తీరును ఖండించారు. ప్రతిపక్షాల నిరసనలు కొనసాగడంతో స్పీకర్ సభను సోమవారానికి వాయిదా వేశారు.

**ఎగువ సభలోనూ అదే నిరసన**

రాజ్యసభలోనూ నిరసనల పర్వం కొనసాగింది. విపక్షాలపై ఛైర్మన్ సీపీ రాధాకృష్ణన్ మండిపడ్డారు. "మీరు మాట్లాడేది వినాలని అందరూ కోరుకుంటున్నారు. మీరు మాత్రం ఎవరి మాటా వినడానికి ఇష్టపడం లేదు. ఇది ముమ్మాటికీ తప్పే. అది నియంతృత్వం. మీరు ప్రజాస్వామ్య విలువలకు గౌరవం ఇవ్వడం లేదు. మీరు ఇతరులు చెప్పేది సైతం వినాలి"అని విపక్షాలకు సూచించారు. ఈ సమయంలో ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గేకు మాట్లాడే అవకాశం ఇవ్వగా, ఆయన రూల్ 267కింద విద్యార్థులపై పోలీసుల దాడి అంశాన్ని ప్రస్తావిస్తుండగానే ఛైర్మన్ సభను సోమవారానికి వాయిదా వేశారు.

**విరాళాల చోరీపై వినూత్న నిరసన**

అయోధ్య రామాలయ విరాళాల చోరీపై విపక్షాలు పార్లమెంట్ మకర ద్వారం వద్ద వినూత్న రీతిలో నిరసన తెలిపాయి. స్వతంత్ర ఎంపీ పప్పూ యాదవ్ కాషాయ వస్త్రాలు ధరించి హిందూ పూజారి వేషంలో విరాళాల పెట్టెతో వీధి నాటకం తరహాలో నిరసనకు దిగారు. హుండీ సొమ్ము వ్యవహారంలో జరిగిన అక్రమాలను ప్రతీకాత్మకంగా చూపించేందుకు ఈ కార్యక్రమం నిర్వహించినట్లు ప్రతిపక్ష నేతలు తెలిపారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ కూడా ఈ నిరసనలో పాల్గొని, విరాళాల పెట్టెలో డబ్బులు వేశారు. ఆయనతోపాటు కాంగ్రెస్, ఇతర ప్రతిపక్ష పార?టల ఎంపీలు సైతం నిరసనలో పాలుపంచుకున్నారు. విరాళాల చోరీపై పార్లమెంట్‌లో చర్చ నిర్వహించాలంటూ నినాదాలతో హోరెత్తించారు.

# పెద్ది సుదర్శన్ రెడ్డి అంత్యక్రియల్లో హరీశ రావు కన్నీటిపర్యంతం

(మొదటి పేజీ తరువాయి)

బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి (51) అంత్యక్రియలు శుక్రవారం ముగిశాయి. తన ఆప్తమిత్రుడిని కడసారి చూసి మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్ రావు తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. అంతిమయాత్రలో ఆయన కన్నీటిపర్యంతమయ్యారు. బీఆర్ఎస్ కార్యకర్తలు, నేతలు, అభిమానులు భారీ సంఖ్యలో తరలివచ్చి దివంగత నేతకు తుది వీడ్కోలు పలికారు. గురువారం రాత్రి సికింద్రాబాద్‌లోని యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతూ పెద్ది సుదర్శన్ రెడ్డి తుదిశ్వాస విడిచారు. జూలై 26న హనుమకొండలోని తన నివాసంలో ఆయనకు ఛాతీలో నొప్పి రావడంతో స్థానిక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ ఆయనకు గుండెపోటు వచ్చినట్లు నిర్ధారించిన వైద్యులు, అత్యవసర చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం సికింద్రాబాద్ యశోద ఆసుపత్రికి తరలించగా, వెంటిలేటర్‌పై చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి ఆయన కన్నుమూశారు. ఆయన భౌతికకాయాన్ని తొలుత హనుమకొండకు తీసుకువచ్చి అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పించారు. అనంతరం నర్సంపేట మీదుగా ఆయన స్వగ్రామమైన నల్లబెల్లికి తరలించి అంత్యక్రియలు నిర్వహించారు. తెలంగాణ ఉద్యమం ప్రారంభమైన 2001 నుంచి పెద్ది సుదర్శన్ రెడ్డి బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కు అత్యంత సన్నిహితుడిగా కొనసాగారు. ఆయన మృతిపై కేసీఆర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఉద్యమ సహచరుడిని, ఆత్మీయుడిని కోల్పోవడం తీరని లోటని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

# మీ పెట్టుబడులకు రక్షణ

ఫారూచ్యన్ 500 కంపెనీలు భారత్ ఫ్యూచర్ సిటీలో పెట్టుబడులు పెట్టాలనేది తమ ఆకాంక్ష అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. కాలుష్యంతో ఢిల్లీ, వర్షాలతో ముంబై, ట్రాఫిక్ కష్టాలతో బెంగళూరు, ప్రకృతి వైపరీత్యాలతో చెన్నై సతమవుతున్న నేపథ్యంలో భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకొని తెలంగాణను క్యూర్, ప్యూర్, రేర్‌గా విభజించామని సీఎం చెప్పారు. ఔటర్ రింగ్‌రోడ్డు లోపల ప్రాంతాన్ని క్యూర్‌గా గుర్తించామని, ఇక్కడ సేవా రంగానికి పెద్దపీట వేస్తున్నామని చెప్పారు. ఔటర్ నుంచి రీజనల్ రింగ్‌రోడ్డు వరకు ప్రాంతాన్ని ప్యూర్‌గా గుర్తించామని.. అక్కడ తయారీ రంగానికి ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. రీజనల్ రింగ్‌రోడ్డు వెలుపల వ్యవసాయం, వ్యవసాయ అనుబంధ పరిశ్రమలకు ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు రేవంత్ వివరించారు. హైదరాబాద్ పరిధిలోని పరిశ్రమలను ప్యూర్ ప్రాంతానికి తరలిస్తామని స్పష్టం చేశారు. రేడియల్ రోడ్లు నిర్మిస్తామని.. పోర్టుకు అనుసంధానంగా రహదారులు అభివృద్ధి చేస్తామన్నారు. ఫ్యూచర్ సిటీ నుంచి మచిలీపట్నం పోర్టు వరకు 12 లేన్ల రహదారి నిర్మిస్తున్నామని తెలిపారు. తెలంగాణ సంస్కృతి తమకు పెద్ద ఆస్తి అని.. హైదరాబాద్‌లో అన్ని రాష్ట్రాల ప్రజలున్నారని సీఎం చెప్పారు. ఇక్కడ పెట్టుబడులు పెట్టిన దానికి రెట్టింపు ఆదాయం వస్తుందన్నారు. పారిశ్రామికవేత్తలు కోరిన వసతులు కలి?పస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నిత్యం అందుబాటులో ఉంటారని చెప్పారు. పరిశ్రమల శాఖ మంత్రి రెండు నెలలకోసారి, తాను మూడు నెలలకోసారి అందుబాటులో ఉండి సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. తెలంగాణను తమ సొంత ప్రాంతంగా భావించాలని సీఐఐ ప్రతినిధులకు సీఎం సూచించారు. ఏఐ సునామీతో వైట్‌కాలర్ ఉద్యోగాలు పోతున్నందున తాము నైపుణ్యాభివృద్ధిపై దృష్టి కేంద్రీకరించినట్లు సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. ఇందుకోసం యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ నెలకొల్పామని చెప్పారు. ఐటీఐలను ఏటీసీలుగా మారుస్తున్నామని.. వాటిలో శిక్షణ పొందిన వారికి 100 శాతం ఉద్యోగాలు వచ్చాయన్నారు. డిమాండ్ ఉన్న కోర్సులనే బోధిస్తున్నామన్నారు. హైదరాబాద్‌లోని జీసీసీల్లో 200 కంపెనీలు పెట్టుబడులు పెట్టడానికి ముందుకు వచ్చాయని చెప్పారు. డేటా సెంటర్లపై అమెజాన్ రూ. లక్ష కోట్లు, అదానీ రూ. 35 వేల కోట్లు పెట్టుబడి పెడుతున్నాయని వివరించారు. సమావేశంలో ముఖ్యమంత్రి సలహాదారు రామకృష్ణారావు, పరిశ్రమల శాఖ స్పెషల్ సెక్రటరీ కృష్ణ ఆదిత్య, సీఐఐ ఉత్తరాది వైస్ చైర్మన్ శారదా సూరి మార్వా తదితరులు పాల్గొన్నారు.

## సూపర్ ఎల్ నినో సమయంలో ప్రతి నీటి బొట్టు విలువైనదే: పవన్ కల్యాణ్



రాష్ట్రంలో సూపర్ ఎల్‌నినో ప్రభావం వల్ల నెలకొన్న సాగునీటి కొరతపై ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రతి నీటి బొట్టు ఎంతో అమూల్యమైనదని, కాలువల్లో పూడిక తీత, గట్ల లీకేజీల నివారణ వంటి తక్షణ చర్యల ద్వారా నీటి వృథాను అరికట్టాలని పిలుపునిచ్చారు.డిప్యూటీ సీఎం క్యాంపు కార్యాలయంలో జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఆయనతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని సాగునీటి పరిస్థితులపై ఇరువురూ విస్తృతంగా చర్చించారు. నీటి ఎద్దడిపై రైతుల్లో అవగాహన కల్పించడంతో పాటు, ప్రత్యామ్నాయ సాగు మార్గాలపై దృష్టి సారించాలని పవన్ సూచించారు. రైతుల ఆందోళనను తగ్గించేందుకు అధికారులతో పాటు ప్రజాప్రతినిధులు కూడా బాధ్యత తీసుకోవాలన్నారు.పిఠాపురం, పెద్దాపురం, జగ్గంపేట నియోజకవర్గాల రైతు ప్రయోజనాల కోసం ఏలేరు ప్రాజెక్టు నుంచి వెయ్యి క్యూసెక్కుల నీటిని విడుదల చేసినందుకు మంత్రి నిమ్మల రామానాయుడికి పవన్ కల్యాణ్ కృతజ్ఞతలు తెలిపారు. క్షేత్రస్థాయి పరిస్థితులను పరిశీలించేందుకు తానే స్వయంగా ఏలేరు ఆయకట్టు ప్రాంతాల్లో పర్యటిస్తున్నట్లు మంత్రి వివరించారు.కాగా, ఇటీవల శస్త్రచికిత్స చేయించుకున్న పవన్ కల్యాణ్ ఆరోగ్య పరిస్థితిని మంత్రి నిమ్మల అడిగి తెలుసుకున్నారు. ఆయన త్వరితగతిన పూర్తి కోలుకుని, మళ్లీ ప్రజాసేవలో మునుపటి కంటే మరింత చురుగ్గా పాల్గొనాలని ఆకాంక్షించారు.

## ఆస్ట్రేలియా మంత్రికి స్వాగతం పలికిన నారా లోకేశ్... రేపు కీలక ఒప్పందాలు

### ఆంధ్రప్రదేశ్‌లో పర్యటిస్తున్న ఆస్ట్రేలియా సహాయ మంత్రి జూలియన్ హిల్

### గన్నవరం ఎయిర్‌పోర్టులో ఘన స్వాగతం పలికిన మంత్రులు లోకేశ్, టీజీ భరత్

### భాగస్వామ్యం బలోపేతంపై ఆశాభావం వ్యక్తం చేసిన మంత్రి లోకేశ్

ఆంధ్రప్రదేశ్, ఆస్ట్రేలియా మధ్య ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేసే దిశగా కీలక అడుగు పడింది. ఆస్ట్రేలియా అంతర్జాతీయ విద్య, పౌరసత్వ వ్యవహారాల సహాయ మంత్రి జూలియన్ హిల్ శుక్రవారం ఆంధ్రప్రదేశ్‌లో పర్యటనకు విచ్చేశారు. గన్నవరం విమానాశ్రయానికి చేరుకున్న ఆయనకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఘన స్వాగతం లభించింది. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్, పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ కలిసి జూలియన్ హిల్‌కు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. ఈ పర్యటన వివరాలను మంత్రి లోకేశ్ తన ఎక్స్ ఖాతా ద్వారా వెల్లడించారు. ఆస్ట్రేలియా మంత్రితో జరగనున్న చర్చలు ఫలవంతం అవుతాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. అంతర్జాతీయ విద్య, నైపుణ్యాలు, ఆవిష్కరణలు, పెట్టుబడుల వంటి కీలక రంగాల్లో ఇరుపక్షాల మధ్య భాగస్వామ్యాన్ని మరింత పటిష్ఠం చేసుకోవడంపై ఈ పర్యటనలో ప్రధానంగా దృష్టి సారించనున్నట్లు లోకేశ్ తెలిపారు. ఈ పర్యటన ద్వారా ఏపీ, ఆస్ట్రేలియా మధ్య సహకారం కొత్త పుంతలు తొక్కుతుందని అధికారులు భావిస్తున్నారు.





## బాధిత కుటుంబాలకు గ్రామ పంచాయతీ ఆర్థిక సాయం

- రూ. 16 వేల ఆర్థిక నెరవు అందించిన పాలకవర్గం
- కష్ట సమయంలో అండగా నిలిచిన పాలకవర్గం



**తొలివెలుగు, రాజాపేట:** గ్రామ పంచాయతీ సిబ్బంది కుటుంబాల్లో సంభవించిన విషాదాల పట్ల రాజాపేట గ్రామ పంచాయతీ పాలకవర్గం స్పందించి ఆర్థిక సాయం అందించింది. శుక్రవారం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద రెండు బాధిత కుటుంబాలకు రూ. 8,000 చొప్పున మొత్తం రూ. 16,000 ఆర్థిక సాయాన్ని సర్పంచ్, పాలకవర్గ సభ్యులు అందజేశారు. వివరాల్లోకి వెళ్తే... గ్రామ పంచాయతీ సిబ్బంది ఎర్రగోకుల అశోక్ తల్లి ఎర్ర గోకుల లలిత ఇటీవల మృతి చెందగా, ఆ కుటుంబానికి రూ. 8,000 అందజేశారు. అదేవిధంగా గ్రామ పంచాయతీ కంప్యూటర్ ఆపరేటర్ వల్లూరి కళ్యాణ్ చక్రవర్తి తండ్రి వల్లూరి వీరస్వామి మరణించడంతో వారి కుటుంబానికి రూ. 8,000 సాయం అందించి పరామర్శించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. పంచాయతీ అభివృద్ధిలో భాగస్వాములవుతున్న సిబ్బందికి ఏ కష్టం వచ్చినా పాలకవర్గం అండగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ కోయ మధు, ఉపసర్పంచి నమిల కేదారి గౌడ్, పంచాయతీ కార్యదర్శి నారెడ్డి రాజమహేందర్ రెడ్డిలతో పాటు వార్డు సభ్యులు పాల్గొన్నారు. తమ కుటుంబాలకు కష్టసమయంలో తోడ్పాటు అందించినందుకు సర్పంచ్, పాలకవర్గం, కార్యదర్శికి గ్రామ పంచాయతీ సిబ్బంది ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

## భావితరాల బాట.. మొక్కల సంరక్షణ

- ప్రతి ఇంటికీ మూడు మొక్కలు నాటాలి
- కురారంలో ఉచితంగా పూల మొక్కల పంపిణీ
- పర్యావరణ పరిరక్షణతోనే భావితరాలకు మేలు: సర్పంచ్ బొడ్డు భాస్కర్




**తొలివెలుగు, రాజాపేట:** నాటిన ప్రతి మొక్కనూ సంరక్షించడం ద్వారానే భావితరాలకు మంచి భవిష్యత్తు అందించిన వారమవుతామని కురారం గ్రామ సర్పంచ్ బొడ్డు భాస్కర్ అన్నారు. శుక్రవారం రాజాపేట మండలం కురారం గ్రామ పంచాయతీ పరిధిలో ఉపాధి హామీ (వీ.బీ.జీ. రాంజీ) పథకం కింద నర్సరీలో పెంచిన వివిధ రకాల పూల మొక్కలను గ్రామ ప్రజలకు పంపిణీ చేశారు. ?ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. గ్రామంలోని ప్రతి ఇంటికీ కనీసం మూడు మొక్కల చొప్పున నాటి, వాటిని బాధ్యతాయుతంగా కాపాడుకోవాలని విజ్ఞప్తి చేశారు. ?కార్యక్రమంలో ఉప సర్పంచ్ రావి కొండల్‌రెడ్డి, వార్డు సభ్యులు ఎం.డి. యూసఫ్, ఎర్రగుంట ప్రభాకర్, మేడి స్వరూప, మాజీ సర్పంచ్ బూరుగు రమేష్, ఫీల్డ్ అసిస్టెంట్ జంగిటి మధులత, ఇందిరమ్మ కమిటీ అధ్యక్షుడు పాండవుల బసవరాజ్ గౌడ్, కాంగ్రెస్ యూత్ అధ్యక్షుడు నంద నరేష్, గ్రామ పంచాయతీ సిబ్బంది ఊట్కూరి రవీందర్, నాగరాజు, గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు పాల్గొన్నారు.

## కామ్రేడ్ పూనం లింగయ్యకు ఘన నివాళి

- సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో వర్ధంతి సభ
- లింగయ్య ఆశయ సాధనకు కృషి చేయాలి: పగడాల శివ

**తొలివెలుగు, భూదాన్ పోచంపల్లి:** భూదాన్ పోచంపల్లి పురపాలక కేంద్రంలో సిపిఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ ఆధ్వర్యంలో కామ్రేడ్ పూనం లింగయ్య ఏడో వర్ధంతి కార్యక్రమాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి న్యూడెమోక్రసీ పట్టణ కార్యదర్శి పగడాల శివ ముఖ్య అతిథిగా హాజరై లింగయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా పగడాల శివ మాట్లాడుతూ... బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి, పేదల హక్కుల సాధన కోసం పూనం లింగయ్య చేసిన కృషి చిరస్మరణీయమని కొనియాడారు. బూటకపు ఎన్‌కౌంటర్ పేరిట పోలీసులు ఆయనను హతమార్చిన ఘటనను ఎప్పటికీ మరవలేమని ఆవేదన వ్యక్తం చేశారు. లింగయ్య చూపిన ఆశయ సాధన మార్గంలో ప్రతి ఒక్కరూ పయనించి, ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు పోతగల్ల నరసింహ, కొత్త బాబు, రచ్చ వెంకటేశం, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల ఆరోగ్యం, నాణ్యమైన విద్యపై ప్రత్యేక దృష్టి





- అధికారులకు జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి ఆదేశాలు
- తుర్కపల్లి మండలంలో పలు విద్యాసంస్థల ఆకస్మిక తనిఖీ

**తొలివెలుగు, యాదాద్రిభువనగిరి/తుర్కపల్లి:** విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, వారికి నాణ్యమైన, రుచికరమైన పోషకాహారం అందించాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన తుర్కపల్లి మండలం రాంపూర్ తండాలోని ప్రభుత్వ కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయ (కేజీబీవీ), పీఎం శ్రీ మోడల్ స్కూల్ అండ్ కాలేజీ, ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ?ముందుగా కేజీబీవీని సందర్శించిన కలెక్టర్ విద్యార్థుల హాజరు, ఉపాధ్యాయుల పనితీరును అడిగి తెలుసుకున్నారు. వంటగది, స్టోర్ రూమ్‌లను పరిశీలించి, వంటప్రాంతం పరిశుభ్రంగా ఉంచాలని స్పష్టం చేశారు. గుడ్లు, వంటనూనె ప్యాకెట్ల గడువు తేదీలను స్వయంగా పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడుతూ.. మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా? చికెన్ పెట్టారా? అని ఆరా తీశారు. రక్తహీనత ఉన్న విద్యార్థినులపై ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించాలని, ఐరన్ ఎక్కువగా ఉండే ఆహారం అందించాలని సూచించారు.

**హెచ్‌పీవీ వ్యాక్సిన్‌పై అవగాహన కల్పించాలి:**

పీఎం శ్రీ మోడల్ స్కూల్‌ను సందర్శించిన కలెక్టర్.. మరుగుదొడ్ల నిర్వహణ, నీటి వసతిపై ఆరా తీశారు. ఈ విద్యా సంవత్సరంలో ఆర్‌బీఎస్‌కే బృందం ఆరోగ్య పరీక్షలు నిర్వహించలేదని తెలుసుకుని, వెంటనే పరీక్షలు చేయించేలా చర్యలు తీసుకోవాలని ప్రిన్సిపాల్‌ను ఆదేశించారు. 14 ఏళ్ల లోపు బాలికలకు హెచ్‌పీవీ వ్యాక్సిన్‌పై అవగాహన కల్పించి, 100 శాతం టీకా అందేలా చూడాలని డీఈఓకు సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి సామ్, మామ్ చిన్నారులకు అందిస్తున్న పోషకాహారం, బాలామృతం ప్లస్ గడువు తేదీలను పరిశీలించారు. ప్రాథమిక పాఠశాల తనిఖీలో భాగంగా.. బడి ఈడు పిల్లలందరినీ ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి బిక్షపతి, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు నాణ్యమైన విద్య, వసతులు అందించాలి








- తెలంగాణ గురుకుల పాఠశాల, ఏరియా ఆసుపత్రిని తనిఖీ చేసిన అదనపు కలెక్టర్ భాస్కర్ రావు
- అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని అధికారులకు ఆదేశం

**తొలివెలుగు, యాదాద్రిభువనగిరి/రామన్నపేట:** విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు పరిశుభ్రమైన, సురక్షితమైన వాతావరణం కల్పించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు ఆదేశించారు. శుక్రవారం ఆయన రామన్నపేట మండలం జనంపల్లి గ్రామంలోని తెలంగాణ రెసిడెన్షియల్ స్కూల్, కళాశాలను సందర్శించి పరిశీలించారు. తరగతి గదులు, వసతి గృహాలు, వంటశాల, భోజనశాల, మరుగుదొడ్లు, తాగునీటి సౌకర్యాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. విద్యార్థులకు అందిస్తున్న ఆహారాన్ని స్వయంగా తనిఖీ చేయడంతో పాటు, హాజరు రిజిస్టర్‌ను పరిశీలించారు. హాస్టల్ పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని, విద్యార్థుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించి విద్యా ప్రగతిపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు సూచించారు.

**అభివృద్ధి పనులపై సమీక్ష:**

అనంతరం తాగునీటి సరఫరా, పంచాయతీరాజ్, గృహనిర్మాణ శాఖల సహాయ కార్యనిర్వాహక ఇంజనీర్లతో (ఏఈ) అదనపు కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయా శాఖల పరిధిలో కొనసాగుతున్న పనుల పురోగతి, పెండింగ్ పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పెండింగ్ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు.

**ఏరియా ఆసుపత్రి ఆకస్మిక తనిఖీ:**

తర్వాత స్థానిక ఏరియా ఆసుపత్రిని అదనపు కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిబ్బంది హాజరు రిజిస్టర్‌ను పరిశీలించి, విధులకు హాజరవుతున్న వివరాలను అడిగి తెలుసుకున్నారు. వైద్యులు, సిబ్బంది కచ్చితంగా సమయపాలన పాటిస్తూ రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. ఈ పర్యటనలో ఎంపీడీఓ రాములు, ఏఈలు ఆశిష్ రాఘవ, సందీప్, సురేష్, పంచాయతీ కార్యదర్శులు సైదిరెడ్డి, అయ్యప్ప రెడ్డి తదితరులు పాల్గొన్నారు.





# జిల్లాలో 72 గ్రామాల్లో 'భూభారతి' భూ రీ-సర్వే

- పారదర్శకంగా సర్వే నిర్వహించాలి: అదనపు కలెక్టర్ కె. వెంకారెడ్డి
- బసంతపురంలో పనుల తనిఖీ.. నెల రోజుల్లో పూర్తి చేయాలని ఆదేశం
- రైతుల అభ్యంతరాలకు మూడు దఫాల్లో అవకాశం

**తొలివెలుగు, రాజాపేట:** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'భూభారతి' సమగ్ర భూ రీ-సర్వే కార్యక్రమాన్ని యాదాద్రి భువనగిరి జిల్లాలోని 72 గ్రామాల్లో పైలట్ ప్రాజెక్టుగా అమలు చేస్తున్నట్లు జిల్లా రెవెన్యూ విభాగం అదనపు కలెక్టర్ కె. వెంకారెడ్డి తెలిపారు. శుక్రవారం రాజాపేట మండలంలోని బసంతపురం గ్రామంలో కొనసాగుతున్న భూ సర్వే పనులను ఆయన ఆకస్మికంగా పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ.. 1924లో జరిగిన భూ సర్వే అనంతరం దాదాపు శతాబ్దం తర్వాత ప్రభుత్వం ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో సమగ్ర భూ రీ-సర్వే చేపట్టడం చారిత్రాత్మకమని పేర్కొన్నారు. భూ రికార్డుల్లో పారదర్శకత తీసుకురావడం, భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమన్నారు. జిల్లాలో ప్రస్తుతం 11 రోవర్ సర్వే పరికరాలు అందుబాటులో ఉన్నాయని, అవసరానికి అనుగుణంగా మరిన్ని పరికరాలను కొనుగోలు చేయడం లేదా అద్దెకు తీసుకునే చర్యలు చేపడుతున్నామని తెలిపారు. సర్వే ప్రక్రియను పూర్తిస్థాయి కచ్చితత్వంతో, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా నిర్వహించాలని సర్వే బృందాలను ఆదేశించారు.

**మూడు దఫాల్లో అభ్యంతరాలకు అవకాశం:**

సర్వే పూర్తయిన అనంతరం గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద భూముల వివరాలను నోటీసుల రూపంలో ప్రదర్శిస్తామని అదనపు కలెక్టర్ తెలిపారు. రైతులు లేదా భూ యజమానులకు ఏవైనా అభ్యంతరాలు ఉంటే వాటిని స్వీకరించి పరిశీలిస్తామని, అవసరమైతే రీ-సర్వే కూడా నిర్వహిస్తామని చెప్పారు. రైతులు తమ అభ్యంతరాలు, వివరాలు సమర్పించేందుకు మూడు దఫాల్లో అవకాశం కల్పించనున్నట్లు వెల్లడించారు.

**పభుత్వ, ప్రైవేట్ భూములకు స్పష్టమైన హద్దులు:**

ఈ రీ-సర్వేలో ప్రభుత్వ భూములు, ప్రైవేట్ పట్టా భూములు, చెరువులు, కుంటలు, వాగులు తదితర భూభాగాలకు స్పష్టమైన హద్దులు నిర్ణయించి డిజిటల్ రికార్డులు రూపొందించనున్నట్లు అధికారులు తెలిపారు. దీంతో భవిష్యత్తులో భూ వివాదాలు తగ్గడంతో పాటు భూ రికార్డులు మరింత పారదర్శకంగా మారనున్నాయని పేర్కొన్నారు. రాజాపేట మండలంలోని బసంతపురం, కాల్వపల్లి, లక్ష్మక్కపల్లి, బూరుగుపల్లి గ్రామాల్లో ప్రస్తుతం భూ సర్వే పనులు కొనసాగుతున్నాయని, బసంతపురం గ్రామంలో నెల రోజుల వ్యవధిలో సర్వే పూర్తి చేయడానికి చర్యలు చేపట్టినట్లు సర్వేయర్ మోత్కుపల్లి సత్యం తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ గోలి రవికిరణ్, ఆర్ఐ పల్లెపాటి నరసింహులు, జీపీఓ మహాలక్ష్మి, ఎంబీఆర్ ఫౌండేషన్ చైర్మన్ మెండు భాస్కర్ రెడ్డి, ఇండ్ల నరసయ్య ఫౌండేషన్ చైర్మన్ ఇండ్ల నరేష్, సర్పంచులు మెండు రత్నమాల, ఇండ్ల లక్ష్మి, రెవెన్యూ సిబ్బంది, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.



## జనంపల్లి గురుకులంలో ప్రవేశాలు.. దరఖాస్తుల ఆహ్వానం


- 6, 7, 8 తరగతుల ఖాళీ సీట్ల భర్తీకి నోటిఫికేషన్
- అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్న ప్రిన్సిపాల్ నాగమ్మ

**తొలివెలుగు, రామన్నపేట:** రామన్నపేట మండలం జనంపల్లిలోని తెలంగాణ బాలికల గురుకుల పాఠశాలలో 2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించి వివిధ తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్లను భర్తీ చేయనున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ కె. నాగమ్మ వెల్లడించారు. శుక్రవారం ఆమె విలేకరులకు ఈ వివరాలను వెల్లడించారు. 6వ, 7వ, 8వ తరగతుల్లో ఖాళీలు ఉన్నాయని, అర్హత కలిగిన విద్యార్థినులు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

**ఆగస్టు 5న ఎంట్రన్స్ ఎగ్జామ్:**
దరఖాస్తు చేసుకోవాలనుకునే విద్యార్థినులు ఆధార్ కార్డు, బోనాఫైడ్ జిరాక్స్ ప్రతులతో పాటు రెండు పాస్‌పోర్ట్ సైజు ఫోటోలను జతచేసి, ఆగస్టు 3వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు జనంపల్లి గురుకుల పాఠశాలలో దరఖాస్తు ఫారాలు అందజేయాలని స్పష్టం చేశారు. దరఖాస్తు చేసుకున్న వారికి ఆగస్టు 5వ తేదీ (బుధవారం) ఉదయం 10 గంటలకు పాఠశాలలోనే ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామని, మెరిట్, ప్రభుత్వ నిబంధనల ప్రకారం సీట్లు కేటాయిస్తామని వెల్లడించారు. విద్యార్థినులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని కోరారు.

## పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

- వలిగొండలో ఘనంగా బీజేపీ 'ప్రవాస్ యోజన'
- తెలంగాణలో అధికారంలోకి వచ్చేది బీజేపీయే: పాశం భాస్కర్



**తొలివెలుగు, వలిగొండ:** వలిగొండ మండలంలో భారతీయ జనతా పార్టీ చేపట్టిన 'ప్రవాస్ యోజన' కార్యక్రమం రెండో రోజు శుక్రవారం ఉత్సాహభరిత వాతావరణంలో కొనసాగింది. మండలంలోని వర్కట్‌పల్లి, సంగెం శక్తి కేంద్రాల పరిధిలోని పలు బూత్‌లలో పార్టీ నాయకులు విస్తృతంగా పర్యటించి, కార్యకర్తలు, పరివార్ సంస్థల ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు పాశం భాస్కర్ హాజరయ్యారు. ఆయన వీహెచ్‌పీ, ఆర్ఎస్ఎస్ పూర్వ ప్రతినిధులతో ప్రత్యేకంగా భేటీ అయి పలు ఆధ్యాత్మిక, సాంస్కృతిక, రాజకీయ అంశాలపై చర్చించారు. అనంతరం బూత్‌లలో పర్యటించి సర్వే ప్రక్రియను పరిశీలించారు. అనంతరం బీజేపీ మండల అధ్యక్షుడు బోల్ల సుదర్శన్ అధ్యక్షతన మండల పదాధికారులు, ముఖ్య నాయకులతో విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పాశం భాస్కర్ మాట్లాడుతూ... మండలంలో పార్టీని క్షేత్రస్థాయి నుంచి మరింత బలపేతం చేయడానికి ప్రతి కార్యకర్త శ్రమించాలన్నారు. రాబోయే రోజుల్లో రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పరివార్ క్షేత్ర ప్రతినిధులు సుదర్శన్ రెడ్డి, శివానంద చార్యులు, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొప్పుల యాదిరెడ్డి, మహిళా మోర్చా జిల్లా కార్యదర్శి మందుల లక్ష్మి, జిల్లా నాయకులు రాచకొండ కృష్ణ, తానేష్, నరసింహ, జిల్లా కార్యవర్గ సభ్యులు మైసొల్ల రామనర్సు, రాస వెంకట్, బిఎల్ఏలు మండలోజు రాజేశ్వర ఆచారి, కుమారస్వామి, నాగరాజు, లోడే సుజాత, లింగస్వామి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## గీత కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలి

- 'గీతన్నల చైతన్య యాత్ర' వాల్ పోస్టర్ ఆవిష్కరణ
- మానుకోట నుంచి ట్యాంక్‌బండ్ వరకు బస్సు యాత్ర: రాగిరి కృష్ణ

**తొలివెలుగు, భూదాన్ పోచంపల్లి:** గీత కార్మిక వృత్తిలో ఎదురవుతున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన 'గీతన్న చైతన్య యాత్ర' వాల్ పోస్టర్‌ను పట్టణ, మండల గౌడ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఆవిష్కరించారు. స్థానిక కంఠమహేశ్వర స్వామి దేవాలయంలో జరిగిన ఈ కార్యక్రమానికి జిల్లా గౌడ సంఘం అధ్యక్షుడు రాగిరి కృష్ణ ముఖ్య అతిథిగా హాజరై పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా రాగిరి కృష్ణ మాట్లాడుతూ... శాసనసభ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలన్నారు. గీత కార్మికుల హక్కుల సాధన కోసం మానుకోట (మహబూబాబాద్) నుంచి హైదరాబాద్ ట్యాంక్‌బండ్ వరకు చేపట్టే బస్సు యాత్రను ప్రతీ కార్మికుడు హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. 50 ఏళ్లు నిండిన ప్రతి గీత కార్మికుడికి పింఛను మంజూరు చేయడంతో పాటు, పెండింగ్‌లో ఉన్న ఎక్స్‌గ్రేషియా నిధులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రోజురోజుకూ విస్తరిస్తున్న రియల్ ఎస్టేట్ వ్యాపారాల వల్ల తాటి, ఈత చెట్లు కనుమరుగవుతున్నాయని, వాటిని సంరక్షించేందుకు ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు గునిగంటి మల్లేష్ గౌడ్, తండ వెంకటేశం, మక్తల పోచయ్య, తంతరపల్లి వెంకటేష్, కట్కూరి సత్యనారాయణ, చెరుకు బిక్షపతి, చెరుకు అంజయ్య, బండి యాదగిరి, నరసింహ, నక్క శీను తదితరులు పాల్గొన్నారు.



# ఆరుతడి పంటలతోనే అధిక లాభాలు

- వరి వేసి నష్టపోవద్దు.. ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులు మొగ్గు చూపాలి: ఏవో పద్మజ
- రఘునాథపురంలో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించిన వ్యవసాయ శాఖ
- ఎల్‌నినో ప్రభావంతో నీటి కొరత.. ఆయిల్ పామ్ సాగుపై రైతులకు అవగాహన



**తొలివెలుగు, రాజాపేట:** ప్రస్తుత వాతావరణ పరిస్థితులు, ఎల్‌నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని రైతులు వరి సాగు చేసి నష్టపోకుండా ఆరుతడి పంటల సాగుపై దృష్టి సారించాలని మండల వ్యవసాయాధికారి (ఏవో) పద్మజ సూచించారు. శుక్రవారం రాజాపేట మండలం రఘునాథపురం గ్రామపంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ పల్లె సంతోష్ అధ్యక్షతన వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతులకు ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో పద్మజ మాట్లాడుతూ.. ఈ ఏడాది ఆశించిన స్థాయిలో వర్షపాతం నమోదయ్యే అవకాశాలు తక్కువగా ఉండటంతో నీటి వినియోగం అధికంగా ఉండే వరి సాగు కంటే తక్కువ నీటితో అధిక దిగుబడి ఇచ్చే ఆరుతడి పంటలను సాగు చేయడం రైతులకు లాభదాయకమని తెలిపారు. వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటల ఎంపిక చేసుకుంటే పెట్టుబడులు తగ్గడంతో పాటు ఆదాయం కూడా పెరుగుతుందని వివరించారు. రైతులు మునగ, బొబ్బర్లు, నువ్వులు, కూరగాయల పంటలతో పాటు ఆయిల్ పామ్ సాగు చేపట్టాలని సూచించారు. ముఖ్యంగా ఆయిల్ పామ్ సాగు వల్ల దీర్ఘకాలికంగా స్థిరమైన ఆదాయం లభిస్తుందని, ప్రభుత్వ ప్రోత్సాహకాలు కూడా అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఆయిల్ పామ్ సాగు విధానం, నిర్వహణ, మార్కెటింగ్ అవకాశాలపై రైతులకు వివరంగా అవగాహన కల్పించారు. సదస్సులో పాల్గొన్న పలువురు రైతులు ఆయిల్ పామ్ సాగుపై ఆసక్తి వ్యక్తం చేయగా, వ్యవసాయ శాఖ అధికారులు వారి సందేహాలకు సమాధానాలు ఇచ్చి సాంకేతిక సూచనలు అందించారు. రైతులు వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని శాస్త్రీయ పద్ధతుల్లో సాగు చేపట్టాలని అధికారులు సూచించారు. ఈ కార్యక్రమంలో రేణికుంట పీఏసీఎస్ చైర్మన్ నమిల మహేందర్ గౌడ్, ఆలేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ సిల్వేరు బాలరాజు గౌడ్, పీఏసీఎస్ డైరెక్టర్లు, వార్డు సభ్యులు, ఏఈఓ ప్రణీత, గ్రామ పెద్దలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# చెమటోడ్చినా దక్కని 'ఉపాధి' ఫలం!

- రెండు నెలలుగా అందని ఉపాధి హామీ వేతనాలు
- కుటుంబ పోషణ భారంగా మారిందంటున్న కూలీలు
- వెంటనే బకాయిలు విడుదల చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి




**తొలివెలుగు, డోర్నకల్:** మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంఎన్ఆర్ఈజీఎస్) కింద పనిచేస్తున్న కూలీలకు రెండు నెలలుగా వేతనాలు అందక తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. కూలీలు ఎండనక, వాననక కష్టపడి పనులు పూర్తి చేసినప్పటికీ, ఇప్పటికీ వారి ఖాతాల్లో వేతనాలు జమ కాకపోవడంతో కుటుంబాల పోషణ భారంగా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉపాధి హామీ పథకం నిబంధనల ప్రకారం కూలీలు చేసిన పనులకు వారం రోజుల్లో లేదా గరిష్ఠంగా 15 రోజుల్లోపు వేతనాలు చెల్లించాల్సి ఉంటుంది. అయితే సంబంధిత శాఖల నిర్లక్ష్యం వల్ల రెండు నెలలు గడిచినా చెల్లింపులు జరగకపోవడం పట్ల కూలీలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. రోజువారీ కూలీపై ఆధారపడి జీవించే కుటుంబాలు వేతనాలు అందక అప్పులు చేసి జీవనం సాగించాల్సిన పరిస్థితి ఏర్పడిందని పలువురు కూలీలు వాపోతున్నారు. ఉపాధి హామీ పనులనే నమ్ముకుని ఇతర ఉపాధి అవకాశాలను కూడా వదులుకున్నామని, ఇప్పుడు చేతిలో డబ్బులు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వేతనాలు ఆలస్యం కావడంతో పిల్లల చదువులు, నిత్యావసరాల కొనుగోలు, వైద్య ఖర్చులు భరించడం కూడా కష్టంగా మారిందని కూలీలు తెలిపారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం సకాలంలో వేతనాలు అందాల్సి ఉన్నప్పటికీ అమలులో తీవ్ర జాప్యం జరుగుతోందని పేర్కొన్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి పెండింగ్‌లో ఉన్న ఉపాధి హామీ వేతనాలను వెంటనే విడుదల చేసి కూలీలకు న్యాయం చేయాలని డోర్నకల్ ప్రాంత ఉపాధి హామీ కూలీలు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. అలాగే భవిష్యత్తులో ఇలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా సకాలంలో వేతనాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

## ప్రభుత్వం ఉదాసీనత వీడాలి!

- సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానం పునరుద్ధరించాలి
- ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలన్నీ వెంటనే అమలు చేయాలి
- టీయూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లచ్చిమల్ల వెంకన్న డిమాండ్

**తొలివెలుగు, రామన్నపేట:** ఉపాధ్యాయులు, విద్యారంగ సమస్యల పట్ల రాష్ట్ర ప్రభుత్వం ఉదాసీన వైఖరిని వీడి ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని తెలంగాణ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీయూటీఎఫ్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లచ్చిమల్ల వెంకన్న డిమాండ్ చేశారు. సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానం (ఓపీఎస్)ను పునరుద్ధరించాలని, పెండింగ్‌లో ఉన్న పీఆర్సీని వెంటనే ప్రకటించాలని ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలంలోని ఉత్తటూరు ప్రాథమికోన్నత పాఠశాలలో సోషల్ స్కూల్ అసిస్టెంట్‌గా విధులు ముగించుకుని ఉద్యోగ విరమణ పొందిన టీయూటీఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షుడు వల్లమల్ల భాస్కర్‌కు ఏర్పాటు చేసిన సన్మాన సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా వల్లమల్ల భాస్కర్ సేవలను కొనియాడిన వెంకన్న, ఆయన ఆదర్శ ఉపాధ్యాయుడిగా విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు విలువలను అందించిన వ్యక్తి అని అన్నారు. ఉపాధ్యాయ వృత్తికి అంకితభావంతో పనిచేస్తూ ఎందరో విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దారని ప్రశంసించారు. అనంతరం విద్యారంగ సమస్యలపై మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల సంక్షేమం, విద్యా వ్యవస్థ బలోపేతానికి ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. ముఖ్యంగా సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయడం, పెండింగ్‌లో ఉన్న పీఆర్సీని ప్రకటించడం, ఎన్నికల సమయంలో ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలను నెరవేర్చడం వంటి అంశాలపై ప్రభుత్వం స్పష్టమైన నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టీయూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కడెం సోమయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి ఉయ్యాల భిక్షమయ్య, మండల నాయకులు పాల్వంచ హరికిషన్, కె. కృష్ణయ్య, ఎం. సూరిబాబు, పి. సత్తయ్య, పలువురు ఉపాధ్యాయులు, సంఘ నాయకులు పాల్గొన్నారు.



## మత్స్యగిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయ నూతన ధర్మకర్తకు సన్మానం

- కూర వెంకటేశంను అభినందించిన బీజేపీ నాయకుడు పోలు నాగయ్య గౌడ్
- ఆలయాభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానన్న నూతన ధర్మకర్త

**తొలివెలుగు, వలిగొండ:** వలిగొండ మండలంలోని వెంకటాపూర్ శ్రీ మత్స్యగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థాన నూతన ధర్మకర్తగా ఎన్నికైన కూర వెంకటేశంను బీజేపీ నాయకుడు పోలు నాగయ్య గౌడ్ మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాగారం గ్రామపంచాయతీ రెండో వార్డు సభ్యుడు గోళ్ళ ప్రవీణ్, కంచనపల్లి మాజీ సర్పంచ్ గంగారం రమేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... కూర వెంకటేశం నూతన ధర్మకర్తగా ఆలయ అభివృద్ధికి, భక్తులకు మెరుగైన సౌకర్యాల కల్పనకు విశేష కృషి చేయాలని, స్వామివారి క్షేత్రం మరింత వైభవంగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. అనంతరం నూతన ధర్మకర్త కూర వెంకటేశం మాట్లాడుతూ... తనపై నమ్మకంతో ధర్మకర్త బాధ్యతలు అప్పగించిన ప్రతి ఒక్కరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఆలయ అభివృద్ధి, భక్తుల సౌకర్యాల విస్తరణతో పాటు మత్స్యగిరి దేవస్థాన ప్రతిష్ఠను మరింత పెంపొందించే దిశగా తనవంతు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని స్పష్టం చేశారు.





## చేనేత కళపై ఫ్యాషన్ విద్యార్థుల అధ్యయనం

- పోచంపల్లిలో హైదరాబాద్ యుఆర్ఎక్స్ ఇన్స్టిట్యూట్ విద్యార్థుల సందర్శన
- నేత ప్రక్రియలు, నూలు వడికే విధానం పరిశీలన
- అంతర్జాతీయ స్థాయిలో పోచంపల్లి వస్త్రాలు: డైరెక్టర్ అరవింద్ సోని



**తొలివెలుగు, భూదాన్ పోచంపల్లి:** ప్రపంచ ప్రసిద్ధి గాంచిన పోచంపల్లి చేనేత కళా ప్రక్రియలను క్షేత్రస్థాయిలో తెలుసుకునేందుకు హైదరాబాద్‌లోని 'యుఆర్ఎక్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ'కి చెందిన 30 మంది ప్రథమ సంవత్సర విద్యార్థులు శుక్రవారం భూదాన్ పోచంపల్లిలో పర్యటించారు. ఈ సందర్భంగా స్థానిక 'కళా పునర్వి హ్యాండ్‌లూమ్ యూనిట్'ను సందర్శించిన విద్యార్థులు.. చేనేత వస్త్రాల తయారీలో కీలకమైన రంగులు అద్దడం, చిటికెలు చుట్టడం, నూలు వడకడం, మగ్గం నేసే విధానాలను ఎంతో ఆసక్తిగా పరిశీలించారు. చేనేత కార్మికులతో ముఖాముఖిగా మాట్లాడి నేత పనుల్లోని సాంకేతికత, ప్రావీణ్యత వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్థానిక టూరిజం పార్కులోని చేనేత మ్యూజియంను సందర్శించి, పోచంపల్లి చేనేత చారిత్రక నేపథ్యాన్ని, ఇక్కత్ శైలి ప్రాశస్త్యాన్ని తిలకించారు. ఈ సందర్భంగా ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్ అరవింద్ సోని మాట్లాడుతూ... భారతీయ సాంప్రదాయ చేనేత కళాగొప్పదనాన్ని విద్యార్థులకు ఆచరణాత్మకంగా వివరించాలనే ఉద్దేశంతోనే ఈ అధ్యయన పర్యటన ఏర్పాటు చేశామన్నారు. ఇక్కడి కార్మికులు తయారుచేస్తున్న వస్త్రాలు అంతర్జాతీయ ప్రమాణాలకు ఏమాత్రం తీసిపోని విధంగా అద్భుతంగా ఉన్నాయని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్ ఊర్వశి సోని, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## పట్టణాభివృద్ధికి పాలనా నైపుణ్యాలు అవసరం

- సీడీఎంఏ ఆధ్వర్యంలో మున్సిపల్ ప్రజాప్రతినిధులకు శిక్షణా తరగతులు
- గచ్చిబౌలి ఈఎస్‌సీఐ ఆడిటోరియంలో మూడో బ్యాచ్ వర్క్‌షాప్
- హాజరైన చౌటుప్పల్ వైస్ చైర్మన్ గోశిక వినయ్ కుమార్, కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు

**తొలివెలుగు, చౌటుప్పల్:** పట్టణ ప్రాంతాల్లో ప్రజలకు వేగవంతమైన, పారదర్శకమైన సేవలు అందించడానికి పాలనా నైపుణ్యాలు ఎంతో అవసరమని చౌటుప్పల్ మున్సిపల్ వైస్ చైర్మన్ గోశిక వినయ్ కుమార్ అన్నారు. కమీషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ (సీడీఎంఏ) ఆధ్వర్యంలో హైదరాబాద్ గచ్చిబౌలిలోని ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా (ఈఎస్‌సీఐ) ప్రధాన ఆడిటోరియంలో నిర్వహించిన మూడవ బ్యాచ్ శిక్షణా తరగతుల కార్యక్రమానికి చౌటుప్పల్ పురపాలక సంఘం పాలకవర్గం హాజరైంది.

**సుపరిపాలనే లక్ష్యంగా...**

ఈ సందర్భంగా వైస్ చైర్మన్ గోశిక వినయ్ కుమార్ మాట్లాడుతూ... పట్టణాభివృద్ధి, మౌలిక వసతుల కల్పన, విలీన గ్రామాల పురోగతి, మున్సిపల్ చట్టాలు మరియు నిధుల వినియోగంపై ఈ శిక్షణా తరగతుల్లో నిపుణులు సమగ్ర అవగాహన కల్పించారని తెలిపారు. ప్రజల సమస్యలను క్షేత్రస్థాయిలో వేగంగా పరిష్కరించడానికి, వార్డుల వారీగా అభివృద్ధి ప్రణాళికలు రూపొందించడానికి ఈ వర్క్‌షాప్ ఎంతగానో తోడ్పడుతుందన్నారు. ప్రజాప్రతినిధులు సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకుని చౌటుప్పల్ మున్సిపాలిటీని మోడల్ పట్టణంగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో చౌటుప్పల్ మున్సిపాలిటీలోని 20 వార్డుల కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు, మున్సిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## మొక్కలు నాటి.. పర్యావరణాన్ని పరిరక్షిద్దాం!

- పీపల్‌పహాడ్‌లో ఘనంగా వనమహోత్సవ కార్యక్రమం
- మొక్కలు నాటి, పంపిణీ చేసిన సర్పంచ్ నాగేశ్వరి అశ్విన్ కుమార్
- ప్రతి ఒక్కరూ రెండు మొక్కలైనా పెంచాలి: సర్పంచ్ పిలుపు




**తొలివెలుగు, చౌటుప్పల్:** పర్యావరణ పరిరక్షణతోనే మానవాళి మనుగడ సాధ్యమవుతుందని, ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని పీపల్‌పహాడ్ గ్రామ సర్పంచ్ పులనగారి నాగేశ్వరి అశ్విన్ కుమార్ కోరారు. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం పీపల్‌పహాడ్ గ్రామంలో శుక్రవారం వనమహోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ ఆవరణతో పాటు పలు వీధుల్లో సర్పంచ్, ప్రజాప్రతినిధులు కలిసి మొక్కలు నాటారు. అనంతరం గ్రామస్తులకు ఉచితంగా వివిధ రకాల నీడనిచ్చే, పూల మొక్కలను పంపిణీ చేశారు.

**భవిష్యత్ తరాల కోసం పచ్చదనం:**

ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ... భావితరాలకు స్వచ్ఛమైన గాలి, ఆరోగ్యకరమైన వాతావరణం అందించాలంటే విస్తృతంగా మొక్కలు నాటాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. గ్రామాన్ని హరితమయంగా తీర్చిదిద్దేందుకు గ్రామస్తులందరూ భాగస్వాములు కావాలని, ఇంటింటికీ పంపిణీ చేసిన మొక్కలను నాటి వాటికి క్రమం తప్పకుండా నీరు పోసి కాపాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ బకనగారి శ్రవణ్ గౌడ్, పంచాయతీ కార్యదర్శి గీతా, వార్డు సభ్యులు ఎర్ర సువర్ణ అంజయ్య, ఎర్ర మహేష్, బద్దం సుధాకర్ రెడ్డి, ఎర్ర పూజా పరమేష్, గట్టు మల్లేష్, కొండ మమత, కారోబార్ దానయ్యలతో పాటు స్థానిక అధికారులు, వార్డు ప్రజలు, గ్రామస్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



## కస్టడీ వేధింపుల ఆరోపణలపై పారదర్శక విచారణ చేయండి



పోలీసు కస్టడీలో అక్రమ నిర్బంధం, చిత్రహింసల ఆరోపణలను అత్యంత పారదర్శకంగా విచారించాలని నగర పోలీసు కమిషనర్‌ను హైకోర్టు ఆదేశించింది. మలక్‌పేట పోలీస్‌స్టేషన్‌లో ఓ వ్యక్తిని చట్టవిరుద్ధంగా అదుపులో ఉంచి హింసించారన్న ఆరోపణలపై ఆధారాలను పరిశీలించి బాధితుడు సమర్పించిన ఫిర్యాదుపై తగిన నిర్ణయం తీసుకోవాలని సూచించింది. పి. శ్రీకాంత్ అనే వ్యక్తి దాఖలు చేసిన పిటిషన్‌ను జస్టిస్ టి. మాధవీదేవి విచారించారు. పిటిషనర్ తరఫు న్యాయవాది కదిరే అజిత్ రెడ్డి వాదనలు వినిపిస్తూ, జూలై 17న పోలీసులు శ్రీకాంత్‌ను అదుపులోకి తీసుకుని 24 గంటలకు మించి అక్రమంగా నిర్బంధంలో ఉంచారని, అనంతరం మాత్రమే రిమాండ్‌కు తరలించారన్నారు. నేరాన్ని అంగీకరించాలని ఒత్తిడి చేయడంతో పాటు, హైకోర్టులో వేసిన పిటిషన్‌ను ఉపసంహరించుకోవాలని వేధించారన్నారు. మలక్‌పేట స్టేషన్ పోలీసు అధికారులపై చర్యలు తీసుకోవాలని, బాధితుడికి పరిహారం కూడా అందించాలని కోరుతూ జూలై 21న డీజీపీ, నగర పోలీసు కమిషనర్‌కు ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని వివరించారు. వాదనలను పరిశీలించిన హైకోర్టు, నిర్బంధ సమయంలోని సీసీటీవీ ఫుటేజీ, వైద్య ఆధారాలను తప్పనిసరిగా పరిశీలించి నిష్పక్షపాతంగా విచారణ జరిపి, బాధితుడి వినతిపై చట్టప్రకారం నిర్ణయం తీసుకోవాలని పోలీసు కమిషనర్‌ను ఆదేశించింది. ఈ మేరకు పిటిషన్‌పై విచారణను ముగించింది.

## గ్రామానికి మూడో కన్ను... సీసీ కెమెరా!

- సీసీ కెమెరాలతో గ్రామాలకు భద్రతా కవచం
- చిన్న కొండూర్‌లో మూడో కంటి నిఘా ప్రారంభం
- హాజరైన డీఎస్పీ మధుసూదన్ రెడ్డి, సీఐ మన్మథ్ కుమార్
- నేరాల నివారణకు 'నిఘా నేత్రాలు' కీలకం




**తొలివెలుగు, చౌటుప్పల్:** గ్రామాల్లో శాంతిభద్రతల పరిరక్షణకు, ప్రజల రక్షణకు సీసీ కెమెరాలు ఎంతగానో తోడ్పడతాయని, ప్రతి గ్రామానికి మూడో కంటి నిఘా ఒక భద్రతా కవచం లాంటిదని డీఎస్పీ పి. మధుసూదన్ రెడ్డి అన్నారు. చౌటుప్పల్ మండల పరిధిలోని చిన్న కొండూర్ గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డీఎస్పీ మధుసూదన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై సీఐ జి. మన్మథ్ కుమార్, ఎస్ఐ ఎస్. కృష్ణమాల్‌తో కలిసి కెమెరాలను లాంఛనంగా ప్రారంభించారు.

**పోలీసు దర్యాప్తునకు కీలక ఆధారాలు:**

ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ... సీసీ కెమెరాలు నేరాల నివారణకు అత్యంత సమర్థవంతమైన సాధనమని తెలిపారు. దొంగతనాలు, గొడవలు, రోడ్డు ప్రమాదాలు జరగకుండా నిరంతరం నిఘా ఉంచడానికి, నేరస్థులను త్వరగా గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవడానికి ఇవి పోలీసు దర్యాప్తులో కీలకమైన సాక్ష్యాలను అందిస్తాయన్నారు. ముఖ్యంగా మహిళలు, చిన్నారులు, వృద్ధుల భద్రతకు సీసీ కెమెరాలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. ప్రజల సహకారంతోనే పోలీసు వ్యవస్థ మరింత బలపడుతుందని, "సురక్షిత గ్రామం - స్మార్ట్ గ్రామం" సాధనకు ప్రతి వీధిలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, గ్రామ వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు, స్థానిక పోలీసులు, గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.





# ప్రయాణికులు ఫుల్.. వసతులు నిల్

నగరంలో రద్దీ వేళల్లో మెట్రో రైళ్లలో ప్రయాణించడం నరకప్రాయంగా మారింది. పీక్ అవర్స్‌లో బోగీల సంఖ్య, రైళ్ల ఫ్రీక్వెన్సీ పెంచకపోవడంపై ప్రయాణికులు తోపులాట మధ్యనే ప్రయాణించాల్సి వస్తోంది. పలు స్టేషన్లలో లిఫ్టులు, ఎస్కలేటర్లు కనీసం మరమ్మతులు కూడా నోచుకోవడంలేదు. ముఖ్యంగా వృద్ధులు, దివ్యాంగులు మెట్రో స్టేషన్లకు వెళ్లాలంటే వీల్‌చైర్లు, హెల్పింగ్ సిబ్బంది లేక అవస్థలు పడుతున్నారు. ఇక పార్కింగ్ తిప్పలు మెట్రో ప్రయాణికులకు అనివార్యం కాగా, టికెట్ కౌంటర్ల భారీ క్యూలైన్లు నిత్యకృత్యమవుతున్నాయి. ´డిచిన రెండేళ్లలో మెట్రో నిర్వహణ అధ్వాన్నంగా మారింది. ముఖ్యంగా మెట్రోను గతేడాది బ్రేక్‌డౌన్ సమస్యలు చుట్టుముట్టాయి. బ్రేక్‌డౌన్ కారణంగా మెట్రో ఎప్పుడు ఆగిపోతుందో తెలియని పరిస్థితి నెలకొంది. టికెట్ల ధరలను పెంచడంపై ఉన్న ఆసక్తి... సౌకర్యాల విషయంలో ఎందుకు లేదని మెట్రో ప్రయాణికులు సోషల్ మీడియా వేదికగా ప్రభుత్వాన్ని నిలదీస్తున్నారు. రద్దీ ఎక్కువ ఉండే సమయాలోనైనా ఎలాంటి నియంత్రణ చర్యలను తీసుకోవడంపై ఇప్పటివరకు మెట్రో నిర్వహణ సంస్థ దృష్టి పెట్టలేదనే విమర్శలు ఉన్నాయి. ఏళ్లు గడుస్తున్నా.. మెట్రో సేవల్లో ఎలాంటి పురోగతి కనిపించలేదని, అదనపు బోగీలు ఇప్పుడు వచ్చే పరిస్థితి లేకపోవడంతో.. మెట్రో ప్రయాణమే కష్టతరంగా మారిందని విమర్శస్తున్నారు. మెట్రో సంస్థ నిర్వహణ ముగ్గురు అధికారుల పర్యవేక్షణలో సాగుతున్నా.. మెట్రోలో ప్రయాణికులకు ఎలాంటి మెరుగైన సేవలు అందడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. ఇక అధికారులు చేసే సమీక్షలు కూడా ప్రతిపాదనలకే పరిమితం చేయకుండా కార్యరూపంలోకి తీసుకురావాలన్నారు. రైళ్ల ఫ్రీక్వెన్సీ పెంచడం, మౌలిక వసతులను కల్పించడం, మహిళా ప్రయాణికులకు భద్రత విషయంలో పకడ్బందీ చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని ప్రయాణికులు కోరుతున్నారు.

# గడువు ముగిసినా.. పూర్తికాని బోయిన్‌పల్లి– మేడ్చల్ వంతెన

జాతీయ రహదారి– 44 జాతీయ రహదారి మార్గంలో ట్రాఫిక్ నియంత్రణకు రెండు వేర్వురు ప్రాజెక్టులు హెచ్ఎండీఏ, నేషనల్ హైవే అథారిటీ ఆధ్వర్యంలో జరుగుతున్నాయి. ప్యారడైజ్ బోయిన్‌పల్లి మీదుగా డెయిరీ ఫామ్ వరకు ఫ్లైఓవర్ 5. 32 కిలోమీటర్లకు రూ. 1,487 కోట్ల వ్యయం కాగా.. రెండో ప్రాజెక్ట్ సుచిత్ర నుంచి కొంపల్లి మీదుగా మేడ్చల్ 6 లైన్ల ఫ్లైఓవర్‌తో అండర్ పాస్‌ల నిర్మాణాలకు రూ. 492 కోట్లు మంజూరయ్యాయి. 2022లో ప్రారంభమైన ఈ పనులు మొదట్లో 2024 డిసెంబర్ చివరి నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నప్పటికీ పూర్తికాకపోవడంతో తిరిగి తుది గడువును జూన్ 2026 వరకు పొడిగించారు. అయినా రాష్ట్ర ప్రభుత్వం, నేషనల్ హైవే అథారిటీ అధికారుల నిర్లక్ష్యం మూలంగా ప్రజలకు చుక్కలు చూస్తున్నారు. అయితే కాంట్రాక్టర్లకు నిధుల విడుదల ఆలస్యం కావడం వల్లే పనులు నిలిచిపోయినట్లు తెలుస్తోంది. సుచిత్ర నుంచి మేడ్చల్ వరకు నిర్మాణం చేపడుతున్న కాంట్రాక్టర్ చేతులు ఎత్తేయడంతో పనులు అర్ధాంతరంగా నిలిపివేసినట్లు సమాచారం. ఫ్లై ఓవర్ నిర్మాణ పనులకు మరో కాంట్రాక్టర్‌కు అప్పగించేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారు. కాగా, మరొక కాంట్రాక్టర్ వచ్చే వరకు ఫ్లైఓవర్ పనులు జరిగే అవకాశం లేకుండా పోయిందని అధికారుల ద్వారా తెలుస్తోంది. 2022 ప్రారంభమైన ఈ ప్రాజెక్ట్‌లు మొదట 2024 సంవత్సర చివరి నాటికి పూర్తి చేయాలని పెట్టుకున్న లక్ష్యం అధికారులు, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం మూలంగా 2026 జూన్ వరకు గడువు ఇచ్చినా పనులు పూర్తి చేయాని కాంట్రాక్టర్ల, బాధ్యులపై చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇలాగే ప్రభుత్వ, నేషనల్ హైవే అథారిటీ నిర్లక్ష్యం చేసే పనులు పూర్తికావడానికి మరో గడువు ఇవ్వాల్సి వస్తుందన్న విమర్శలు ప్రజల నుంచి వస్తున్నాయి. కాంట్రాక్టర్ల నిధుల కొరతకు ప్రజలు ఎందుకు ఇబ్బందులు పడాలని, కాంట్రాక్టర్లకు జరిమానాలు విధించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

**నరక ప్రాయంగా ప్రయాణం**

నిర్మాణ పనులు అరకొరగా సాగుతున్న నేపథ్యంలో రహదారిపై తవ్విన గుంతలు అడ్డదిడ్డంగా ఏర్పాటు చేసిన బారికేడ్ల వల్ల నిత్యం కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జామ్‌లు ఏర్పడుతున్నాయి. అత్యవసర సమయంలో వెళ్లే అంబులెన్స్‌లు ట్రాఫిక్‌లో చిక్కుకుంటున్నాయి. మరోవైపు దుమ్ము ధూళితో అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అధికారులు నిర్లక్ష్యం వీడి యుద్ధ ప్రాతిపదికన పనులు చేపట్టి పూర్తి చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

**ప్రభుత్వం ఒత్తిడి తెచ్చేలా బీఆర్ఎస్ పోరాటం**

బోయిన్‌పల్లి నుంచి మేడ్చల్ వరకు నిలిచిన ఆరు లైన్ల ఫ్లైఓవర్ పనులు పూర్తి చేసేలా రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తేచ్చేలా బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పోరాటం చేసేందుకు సిద్ధమవుతున్నారు. ప్రభుత్వంపై ఒత్తిడి పెంచి పనులు ప్రారంభించేలా దశల వారీగా పోరాటం చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు. ఇందులోభాగంగానే కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పోరాటం చేసేందుకు నిర్ణయించుకున్నారు. బోయిన్‌పల్లి నుంచి సుచిత్ర మీదుగా మేడ్చల్ వరకు ఫ్లైఓవర్ పనులను వేగవంతం చేసి పూర్తి చేయాలి. ఫ్లైఓవర్ నిలిచిన నిర్మాణ పనులను ప్రారంభించేలా రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తెచ్చేందుకు త్వరలోనే మహాధర్నా నిర్వహించనున్నాం. మూడేండ్ల కిందట ప్రారంభమై గడువు పూర్తయినా.. పనులు పూర్తికాలేదు. దీంతో ఈ మార్గంలో ట్రాఫిక్ కష్టాలు నిత్యకృత్యమయ్యాయి. 2024 డిసెంబర్ నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నా..

# నిషేధమున్నా.. యథేచ్ఛగా తవ్వకాలు





క్యూర్ (జీహెచ్ఎంసీ, ఎంఎంసీ, సీఎంసీ) పరిధిలో రోడ్ల పరిస్థితి రోత పుట్టిస్తోంది. అడుగడుగునా ఏర్పడిన గుంతలతో నగరవాసులు నిత్యం నరకయాతన అనుభవిస్తున్నారు. గమ్యం చేరాలంటే గంటల తరబడి ట్రాఫిక్‌లో చికుకోవాల్సిందే కాక, ఏ క్షణంలో ఏ గుంత మింగేస్తుందోనని భయంతో హడలిపోతున్నారు. ఇదంతా కండ్లముందే కనిపిస్తున్నా ట్రై కార్పొరేషన్ అధికారులు మాత్రం కండ్లకు గంతలు కట్టుకుని నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుండటంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతున్నది. వాస్తవంగా సెప్టెంబరు నెలాఖరు నాటికి రోడ్ల తవ్వకాలపై నిషేధం ఉంది. భాగ్యనగర గ్యాస్ పైపులైన్ కంపెనీ మినహా ఏ ఒక్కరూ రోడ్ల తవ్వకాలకు అనుమతి లేదు. ఏదైనా ఎమర్జెన్సీ పనులు ఉంటే సంబంధిత కమిషనర్ల అనుమతితో పనులు కొనసాగించవచ్చు. కానీ రోడ్ల తవ్వకాల నిషేధం కాగితాలకే పరిమితమైంది. క్షేత్రస్థాయిలో మాత్రం వివిధ శాఖలు, గుత్తేదారులు యథేచ్ఛగా రోడ్లను తవ్వేస్తున్నారు. పైప్‌లైన్ల నిర్మాణం, మరమ్మతుల పేరుతో జలమండలి సిబ్బంది పెద్ద ఎత్తున రోడ్లను తవ్వి, పనులు పూర్తయ్యాక వాటిని పునరుద్ధరించకుండా అలాగే వదిలేస్తున్నారు. రోడ్ల తవ్వకాల నిషేధం కాగితాలకే పరిమితమవుతున్నది. గుత్తేదారులతో పాటు వివిధ శాఖలు యథేచ్ఛగా రోడ్లను తవ్వేస్తున్నాయి. జీహెచ్ఎంసీ, జలమండలి, విద్యుత్, టెలికాం శాఖల మధ్య కనీస సమన్వయం లేకపోవడమే ఈ దుస్థితికి మూలకారణంగా మారింది. ఒక శాఖ రోడ్డు వేస్తే, మరుసటి రోజే మరో శాఖ వచ్చి మళ్లీ తవ్వేస్తున్నారు.. తవ్విన గుంతలను ముగింపు దశకు తెచ్చే బాధ్యతను ఏ ఒక శాఖా తీసుకోవడం లేదు. కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం, అధికారుల పర్యవేక్షణ లోపంతో రహదారులు కాస్తా మరణమృదంగాలుగా మారుతున్నాయి. ఈ నేపథ్యంలోనే ఉప్పుగూడ ఏరియాలో ఒకవైపు వర్షాలు పడుతున్న సీసీ రోడ్డు వేయడం, అది కాస్తా కొట్టుకుపోవడం అధికారుల పనితీరుకు అద్దం పడుతున్నది. ఈ క్రమంలోనే చిన్న పాటి వర్షం పడినా ఈ గుంతల్లో నీరు చేరి కాలువలని తలపిస్తున్నాయి. ద్విచక్ర వాహనదారులు, బాటసారులు ప్రమాదాల బారిన పడి తీవ్రంగా గాయపడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖల ఉన్నతాధికారులు నిద్రమత్తు వీడి తక్షణమే రోడ్ల పునరుద్ధరణ పనులు చేపట్టాలని, సమన్వయంతో వ్యవహరించి నగరవాసులకు ఈ గుంతల నరకం నుంచి విముక్తి కల్పించాలని నగర ప్రజలు కోరుతున్నారు.

**మచ్చుకు కొన్ని ప్రాంతాలు**

మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పలు ప్రాంతాలలో వర్షాకాలం ప్రారంభమైన రోడ్ల తవ్వకాలు ఆగడంలేదు. పలు కాలనీలలో రోడ్లను తవ్వి వదిలివేయడం, ఇంకా పనులు కొనసాగుతుండటం పనితీరుకు అద్దం పడుతుంది. ఉప్పల్ సర్కిల్ పరిధిలోని హబ్సిగూడ రవీంద్రనగర్ ప్రాంతంలో ఎస్ఎన్‌డీపీ ప్రాజెక్టు పనుల నేపథ్యంలో గత కొన్ని నెలలుగా పనులు కొనసాగుతున్నాయి. వేసవికాలంలో పూర్తిచేయాల్సిన పనులు ఇప్పటికి పూర్తికాలేదు. వర్షాలు ప్రారంభమైన నేపథ్యంలో తవ్వి వదిలేసిన రోడ్లు ప్రమాదకరంగా మారాయి. నిత్యం రద్దీగా ఉండే ఈ రోడ్డులో రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. మీర్జాలగూడ డివిజన్‌లోని వెంకటాద్రినగర్, రాజానగర్ ప్రాంతాలలో పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఈ కాలనీలలో రోడ్లను తవ్వడంతో కాలనీలలో రాకపోకలు నిలిచిపోయాయి. పనులు చేపడుతున్న క్రమంలో ఎలాంటి ప్రమాద నివారణ చర్యలు తీసుకోకపోవడంతో వర్షాకాలంలో ప్రమాదం పొంచి ఉంది. చర్యలు చేపట్టాల్సిన అధికారులు, వీటిని పట్టించుకోకపోవడంతో రోడ్డును తవ్వి, పనులు జాప్యం చేస్తున్నారు. వీటితో పాటు ఉప్పల్, ఘట్‌కేసర్, బోడుప్పల్, మౌలాలి, మల్కాజిగిరి, నేరేడ్‌మెట్, అల్వాల్, కీసర, బోయిన్‌పల్లి ప్రాంతాల్లో రోడ్లు అధ్వానంగా మారాయి. వర్షాల నేపథ్యంలో రోడ్లు గుంతలమయంగా మారాయి. ఉప్పల్–చిలుకానగర్ రోడ్డు, బోడుప్పల్ రోడ్డు, మల్కాజిగిరి, మీర్జాలగూడ, గౌతంనగర్ రోడ్లు ప్రజలకు, వాహనదారులకు చుక్కలు చూపిస్తున్నాయి. రాత్రి సమయంలో ప్రయాణం మరింత ఇబ్బందిగా మారింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి, తగిన చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. ఉన్నతాధికారులు పర్యటించి, తగిన చర్యలు చేపట్టాలని కాలనీవాసులు కోరుతున్నారు.



# సర్ ప్రక్రియను వేగవంతం చేయాలి


ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (సర్) పురోగతి, పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ ప్రక్రియలను వేగవంతం చేయాలని కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీఐ) కార్యదర్శి నవీన్ కుమార్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్ఎంసీ కమిషనర్, హైదరాబాద్ జిల్లా కలెక్టర్‌తో పాటు నగరంలోని 15 అసెంబ్లీ నియోజకవర్గాల ఈఆర్ఓలతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురణ తర్వాత అధిక సంఖ్యలో నోటీసులు జారీ అయితే, దరఖాస్తుల వేగవంతమైన పరిష్కారం కోసం అదనపు ఏఈఆర్ఓలను (ఏఈఆర్వోలు) విధుల్లోకి తీసుకోవాలని సూచించారు. సమీక్షా సమావేశం అనంతరం నవీన్ కుమార్ క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టారు. అమీర్‌పేట్ అసెంబ్లీ నియోజకవర్గంలోని శివభాగ్‌లో ఉన్న 139వ పోలింగ్ కేంద్రాన్ని, సికింద్రాబాద్ కంటోన్మెంట్ నియోజకవర్గ పరిధిలోని సుమన్ హౌసింగ్ కాలనీలోని 81వ పోలింగ్ కేంద్రాన్ని సందర్శించారు.

**ఇతర జిల్లాలతో పోటీపడాలి..**

ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (సర్) ప్రక్రియను రెండు రోజుల్లో పూర్తిచేయాలని భారత ఎన్నికల కమిషన్(ఈసీఐ) సెక్రటరీ నవీన్ కుమార్ అధికారులను



ఆదేశించారు. సర్ పురోగతిపై మేడ్చల్ కలెక్టరేట్‌లో కలెక్టర్ మను చౌదరి, ఇతర ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ .. అధికారులు బాగా పనిచేస్తున్నప్పటికి ఇతర జిల్లాలతో పోలిస్తే మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా సర్ ప్రక్రియలో వెనుకబడి ఉందని అన్నారు. గడువును సద్వినియోగం చేసుకొని సర్ ప్రక్రియను వీలైనం త్వరగా పూర్తిచేయాలని సూచించారు. అనంతరం మేడ్చల్ నియోజకవర్గంలోని తిమ్మాయిపల్లి, కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని దూలపల్లిలలో సర్ ప్రక్రియ తీరును నీవన్ కుమార్ పరిశీలించారు. అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి, డీఆర్ఓ మాలతి, అధికారులు వెంకట్ రెడ్డి, సంచిత్ గంగ్వార్, పింకేష్ కుమార్, రాధికా గుప్తా తదితరులు పాల్గొన్నారు.




# రామాయణ టీజర్ విడుదల

రణ్‌బీర్ కపూర్ ప్రధాన పాత్రలో నితీశ్ తివారీ దర్శకత్వంలో రానున్న సినిమా 'రామాయణ' ఇప్పుడు ఆసక్తి రేకెత్తిస్తోంది. హనుమాన్ జయంతి సందర్భంగా ఈ చిత్రం టీజర్‌ను విడుదల చేశారు. రాముడి పాత్రలో రణ్‌బీర్ ఆకట్టుకుంటున్నారు. వీఎఫ్ఎక్స్ ఈ టీజర్‌కు హైలైట్ గా నిలిచాయి. సుమారు రూ.4000కోట్లతో ఈ ప్రాజెక్ట్ రూపొందుతోంది. మొదటి భాగం దీపావళికి ప్రేక్షకుల ముందుకు రానుంది. ప్రభాస్ ఆదిపురుష్ అంతగా ఆకట్టుకోలేక పోయిన తరవాత వస్తున్న ఈ సినిమాపై భారీగా అంచనాలు ఉన్నాయి. సీతగా సాయిపల్లవి నటిస్తుండగా, రావణుడిగా యశ్ నటిస్తున్నారు. 'రామాయణ' ప్రాజెక్ట్‌లో భాగం కావడంపై నటుడు రణ్‌బీర్ కపూర్ మీడియా మీట్‌లో మాట్లాడారు. ఇలాంటి అద్భుతమైన చిత్రాల్లో నటించాలని తాను అనుకున్నానని.. తన కల నెరవేరిందన్నారు. 2000లో విజువల్ ఆర్ట్స్‌కు సంబంధించి విదేశాల్లో శిక్షణ తీసుకున్నా. ఓసారి నా మిత్రుడు.. నువ్వు ఏం కావాలనుకుంటున్నావు? అమెరికాలోనే స్థిరపడి వర్క్ చేయాలనుకుంటున్నావా? అని అడిగాడు. మా సంస్కృతి, సంప్రదాయాలకు అద్దం పట్టే సినిమాతో అమెరికా వస్తా అని బదులిచ్చా. ఈ సినిమాతో నా కల నెరవేరిందని రణ్‌బీర్ అన్నారు. ఇందులో నటించేందుకు మొదట తాను ఆసక్తి చూపించలేదన్నారు. తండ్రి అయ్యాక తన ఆలోచనా విధానంలో మార్పు వచ్చిందన్నారు. భయాన్ని వదిలి ధైర్యంగా ఈ సినిమాలో నటించేందుకు ముందుకొచ్చానని తెలిపారు.దీపావళి కానుకగా 'రామాయణ' తొలి భాగం ప్రేక్షకుల ముందుకురానుంది.





# వారణాసిలో రాముడు ఎలా ఉంటాడో?


దర్శకధీరుడు రాజమౌళి ప్రస్తుతం టాలీవుడ్ సూపర్ స్టార్ మహేష్ బాబుతో 'వారణాసి' అనే భారీ ప్రాజెక్ట్ చేస్తున్నారు. గ్లోబల్ అడ్వెంచర్‌గా వస్తున్న ఈ సినిమా హాలీవుడ్ స్థాయికి ఏ మాత్రం తగ్గకుండా.. దాదాపు వెయ్యి కోట్ల భారీ బ్జడెట్‌తో తెరకెక్కుతోంది. ఈ సినిమాను రామాయణాన్ని టచ్ చేస్తూ ఊహకందని విధంగా.. విజువల్ వండర్‌గా రూపొందిస్తున్నాడు రాజమౌళి. దీంతో మహేష్ బాబు రాముడి లుక్ ఎలా ఉంటుందా? అని అంతా ఆసక్తిగా వెయిట్ చేస్తున్నారు. ఇప్పటికే వారణాసి వీడియో గ్లింప్స్ అదిరిపోయింది. తాజాగా బాలీవుడ్ హీరో రణ్‌బీర్ కపూర్ నటిస్తున్న 'రామాయణ' సినిమా టీజర్ రిలీజ్ చేశారు. ఇది చూసిన తర్వాత.. వారణాసి రాముడి లుక్ రివీల్ అయితే మాత్రం.. ఇలా ఉండదని అర్థమవుతోంది. రాముడిగా రణ్‌బీర్ కపూర్ లుక్ బాగున్నప్పటికీ.. రాజమౌళి రాముడు ఎలా ఉంటాడా అన్న ఆసక్తి మాత్రం పెరుగతోంది. ఎందుకంటే.. శ్రీరాముడి సీన్ షూట్ తర్వాత.. ఇన్ని రోజుల కష్టానికి ఈ ఒక్క షాట్ చాలు.. అని అనిపించిందని స్వయంగా మహేష్ బాబునే ఓసారి చెప్పుకొచ్చాడు. కాబట్టి.. లుక్స్ పరంగానే కాదు, విజువల్ పరంగాను వారణాసి టాప్ నాచ్ అనేలా ఉంటుందని చెప్పడంలో సందేహం అక్కర్లేదు.

## మా ఇంట్లో ఆంజనేయుడిపై
# సూర్యకిరణాలు

ప్రత్యేక వీడియో పంచుకున్న మెగాస్టార్ చిరంజీవిఅగ్ర కథానాయకుడు చిరంజీవి ఆంజనేయస్వామికి పరమభక్తుడనే విషయం తెలిసిందే. గురువారం హనుమాన్ జయంతిని పురస్కరించుకొని ఆయన ఒక ప్రత్యేక వీడియోను అభిమానులతో పంచుకున్నారు. తన ఇంటిలోని పూజా మందిరంలో చోటుచేసుకొన్న ఓ అపురూప దృశ్యాన్ని ఈ వీడియోలో చూపించారు. ప్రత్యక్ష దైవం ఆ సూర్య భగవానుడి కిరణాలు మా ఇలవేల్పు హనుమంతుడిని స్పృశిస్తున్న అద్భుతమైన సన్నివేశాన్ని మీతో పంచుకుంటున్నాను' అని ఆయన ఈ వీడియో షేర్ చేశారు. హనుమాన్



జయంతి సందర్భంగా మా పూజా మందిరంలో జరిగిన ఒక విశేషాన్ని మీతో పంచుకోవాలని ఈ వీడియో చేస్తున్నా. ప్రతి సంవత్సరం డిసెంబర్, జనవరి, ఫిబ్రవరి నెలల్లో సూర్యకిరణాలు సప్త వర్ణాలుగా మారి మా పూజా మందిరంలో ఉన్న హనుమంతుడిని స్పృశిస్తూ ప్రసరించడం చూస్తుంటే ఆ అనుభూతిని మాటల్లో చెప్పలేను. ఇటీవల మనం అయోధ్యలో బాలరాముడి నుదిటిపై సూర్యకాంతి పడి మెరిసిన అద్భుతాన్ని చూశాం. అలాగే కోణార్క్, అరసవల్లి దేవాలయాల్లో కూడా సూర్య కిరణాలు భగవంతుడిని తాకే విశేషం అందరికీ తెలిసిందే. అలాంటి దైవానుభూతి మా ఇంట్లోనూ ఆంజనేయుడిని స్పృశించడం నా పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నా' అని చిరంజీవి తెలిపారు. అనంతరం అందరికీ హనుమాన్ జయంతి శుభాకాంక్షలు చెప్పారు.





# డెకాయిట్ మూవీపై ప్రేక్షకుల్లో ఆసక్తి

## అడవి శేష్‌కు జోడీగా మృణాల్ ఠాకూర్

టాలీవుడ్ యంగ్ హీరో అడివి శేష్ నటిస్తున్న తాజా చిత్రం 'డెకాయిట్' ఇప్పటికే ప్రేక్షకుల్లో భారీ ఆసక్తిని రేకెత్తిస్తోంది. షనీల్ డియో దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమా రివెంజ్ డ్రామా, రొమాంటిక్ యాక్షన్ థ్రిల్లర్ మేళవింపుగా రూపొందుతోంది. కథ, ట్రీట్‌మెంట్ పరంగా కొత్తదనం చూపించే ప్రయత్నం చేస్తున్నట్లు చిత్రబృందం చెబుతోంది.ఈ చిత్రంలో శేష్‌కు జోడీగా మృణాల్ ఠాకూర్ నటించడం మరో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఇప్పటికే విడుదలైన పోస్టర్లు, గ్లింప్స్ సినిమాపై మంచి బజ్‌ను సృష్టించాయి. ఈ నేపథ్యంలో ఏప్రిల్ 10న ప్రపంచవ్యాప్తంగా ఈ సినిమా విడుదలకు సిద్ధమవుతోంది. ఇక తాజాగా సినిమా ప్రమోషన్లలో భాగంగా అడివి శేష్ అభిమానులతో సోషల్ మీడియా ద్వారా ముచ్చటిస్తూ కీలక ప్రకటన చేశాడు. ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న 'డెకాయిట్' ట్రైలర్‌ను ఏప్రిల్ 4న విడుదల చేయనున్నట్లు ప్రకటించాడు. ఈ ట్రైలర్‌తో సినిమాపై ఉన్న అంచనాలు మరింత పెరుగుతాయని మేకర్స్ ధీమాగా ఉన్నారు.ఈ చిత్రాన్ని అన్నపూర్ణ స్టూడియోస్ సమర్పణలో సుప్రియ యార్లగడ్డ నిర్మిస్తుండగా, సునీల్ నారంగ్ సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. భారీ నిర్మాణ విలువలతో ఈ ప్రాజెక్ట్ రూపొందుతోంది. తెలుగుతో పాటు హిందీలో కూడా ఈ సినిమాను విడుదల చేయాలని ప్లాన్ చేస్తున్నారు. ఇక ఈ సినిమాలో ప్రముఖ నటుడు ప్రకాశ్ రాజ్, బాలీవుడ్ దర్శకుడు-నటుడు అనురాగ్ కశ్యప్ కీలక పాత్రల్లో కనిపించనుండటం విశేషం. వారి పాత్రలు కథకు బలాన్ని అందించనున్నాయని టాక్ వినిపిస్తోంది. సంగీతాన్ని భీమ్స్ సిసిరోలియో అందిస్తుండగా, టెక్నికల్‌గా కూడా సినిమా ఉన్నత స్థాయిలో ఉండబోతోందని చిత్ర యూనిట్ చెబుతోంది. అడివి శేష్ తన కెరీర్‌లో ఎప్పుడూ కంటెంట్ ఆధారిత సినిమాలతోనే గుర్తింపు పొందాడు. ఇప్పుడు 'డెకాయిట్'తో మరోసారి ప్రేక్షకులను ఆకట్టుకుంటాడా అన్న ఆసక్తి నెలకొంది. మొత్తానికి ట్రైలర్ రిలీజ్‌తో 'డెకాయిట్'పై ఉన్న హైప్ మరింత పెరగడం ఖాయం.

# తెలుగులో తొలి ఎఐ చిత్రం... అంబ ద రివెంజ్

తెలుగు సినీ పరిశ్రమలో సరికొత్త అధ్యాయానికి నాంది పలికే విధంగా.. కృత్రిమ మేధ (ఏఐ) సాయంతో రూపొందుతున్న తొలి ఫీచర్ ఫిల్మ్ 'అంబ' ద రివెంజ్' ప్రేక్షకుల ముందుకు రానుంది. సాంకేతిక విప్లవాన్ని తెరపైకి తీసుకువస్తున్న ఈ ప్రాజెక్ట్‌పై ఇప్పటికే సినీ వర్గాల్లో ఆసక్తి నెలకొంది. హనుమాన్ విజయోత్సవం సందర్భంగా ఈ చిత్రానికి సంబంధించిన టైటిల్ పోస్టర్‌ను చిత్ర యూనిట్ విడుదల చేసింది. ఈ చిత్రాన్ని నిర్మాత శ్రీకాంత్ రెడ్డి కుందూరు నిర్మిస్తుండగా.. రాణి మాడిసన్ సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. ఇక జయవర్ధన్ మాడి క్రియేటివ్ డైరెక్టర్‌గా ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. శ్రీ లలితకళా ఫిలిమ్స్, నక్క తోక ఫిల్మ్స్ నిర్మాణ సంస్థలు సంయుక్తంగా ఈ సినిమాను నిర్మిస్తున్నాయి. పౌరాణిక ఇతిహాసమైన మహాభారతంలోని శక్తివంతమైన పాత్ర అంబ కథను ఆధారంగా తీసుకుని ఈ చిత్రాన్ని వినూత్నంగా తెరకెక్కిస్తున్నారు. ఆధునిక సాంకేతికతతో పాటు ఏఐ టూల్స్ వినియోగంతో విజువల్స్, పాత్రల రూపకల్పన, కథన నిర్మాణం వంటి అంశాలను కొత్త శైలిలో ఆవిష్కరించనున్నట్లు చిత్ర బృందం వెల్లడించింది.




# రణబాలిలో ఇంటెన్స్ లుక్‌లో విజయ్

విజయ్ దేవరకొండ హీరోగా, రాహుల్ సంకృత్యన్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న భారీ పీరియడ్ యాక్షన్ డ్రామా 'రణబాలి'. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ అనంతపురంలో శరవేగంగా జరుగుతోంది. అయితే, తాజాగా ఈ షూటింగ్ స్పాట్ నుండి ఒక వీడియో లీక్ అయింది. ఇందులో విజయ్ దేవరకొండ మునుపెన్నడూ చూడని విధంగా చాలా ఇంటెన్స్ లుక్‌లో కనిపిస్తున్నాడు. లీకైన ఫుటేజీలో విజయ్ ఉగ్రరూపంతో కనిపిస్తున్నాడు. ముఖ్యంగా ఆయన డైలాగ్ డెలివరీ వాయిస్ మోడ్యులేషన్ పీక్స్‌లో ఉందనే చెప్పాలి. ఊర మాస్ డైలాగులు థియేటర్లలో విజిల్స్ వేయించడం ఖాయమనిపిస్తోంది. ఈ లీక్డ్ వీడియో చూస్తుంటే.. పవర్ ఫుల్ యాక్షన్స్ సీక్వెన్స్ తెరకెక్కిస్తున్నట్టుగా అనిపిస్తోంది. ఈ సినిమాలో విజయ్ బాడీ లాంగ్వేజ్, ఆ యాస ఆయన కెరీర్‌లోనే అత్యుత్తమంగా నిలుస్తాయని ఫ్యాన్స్ భావిస్తున్నారు. 'ట్యాక్సీవాలా' తర్వాత విజయ్-రాహుల్ సంకృత్యన్ కాంబినేషన్‌లో వస్తున్న రెండో సినిమా ఇది. పైగా ఇందులో రష్మిక మందన్న కథానాయికగా నటిస్తుండటంతో అంచనాలు ఆకాశాన్నంటాయి. అయితే, లీకైన వీడియో చూసి ఫ్యాన్స్ ఖుషీ అవుతున్నప్పటికీ, చిత్ర బృందం మాత్రం ఆందోళన వ్యక్తం చేస్తోంది. ఈ మధ్య వస్తున్న సినిమాలన్నీ కూడా ఇలాంటి లీకుల బారిన పడుతున్నాయి. మేకర్స్ ఎన్ని జాగ్రత్తలు తీసుకున్న లీకుల బెడద తప్పడం లేదు. కానీ, రణబాలి లీక్ మాత్రం.. ఈసారి రౌడీ హీరో రష్మికతో కలిసి బి÷-గగెస్ట్ బ్లాక్‌బస్టర్‌ను కొట్టడం ఖాయమని అభిమానులు భావిస్తున్నారు.

Printed & Published And Owned by **YAMJALA PRAVEEN**, Printed at **SRI VENKATESWARA PRINTING SOLUTIONS** 11-1/B/42, BPM Green Lands Colony, Shabari Gardens Back, Parvathapur, Medipally Mandal, Peerzadiguda, GHMC, Medchal Malkajgiri, Telangana - 500098. Published from 4-33, Near Hanuman Temple, Allapur Village, Choutuppal Mandal, Yadadri Bhuvanagiri, Telangana - 508252. **Editor : YAMJALA PRAVEEN, PRGI No: TGTEL/26/A6221,** Ph. No: 9491134365. Email id: praveenyamjala1@gmail.com, Website: www.tholivelugu.com